




అమరావతి సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరిగే సమావేశ మందిరం



తేమ శాతం పేరిట తకరారు.. సహకరించని అధికారులు.. మొండికేస్తున్న మిల్లర్లు.. చేను దాటని గింజలు.. రోడ్లపైనే ధాన్యం నిల్వలు.. అనుమతి కోసం అన్నదాతల నిరీక్షణ.. గోతాలు లేక, కాటా కూలీలు రాక అవస్థలు.. ఇదీ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి. చివరి గింజ వరకు కొంటాం.. తేమ శాతంలో వెసులుబాటు ఇచ్చాం.. వ్యవసాయశాఖ మిల్లర్ల కోసం కాకుండా రైతుల కోసం పనిచేయాలి.. అని ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో కొర్రీలతో కొనుగోళ్లు సక్రమంగా జరగడంలేదు. పంట పండించేందుకు.. దానిని ప్రకృతి అవాంతరాల నుంచి రక్షించేందుకు.. ఎంతగా రైతులు కష్టపడ్డారో అంతకు మించి విక్రయించేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఓ పక్క వాయుగుండం కంటిపై కునుకు లేకుండా చేస్తుంటే ఆర్.ఎస్.కెలు, మిల్లుల చుట్టూ రైతులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అయినా అధికారులు, మిల్లర్లు కనీసంగా కూడా కనికరించడంలేదు. చాలామంది గిట్టుబాటు ధర రాకపోయినా, వచ్చినరేటుకు చేలల్లోనే ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు.



కరకట్టపై ఆరబోసిన ధాన్యం

కొనుగోళ్లకు.. కొర్రీలు

- తేమ శాతం పేరిట తకరారు
- అన్నదాతకు నో.. దళారులకు సై
- కొనసాగుతున్న ధాన్యం రైతుల కష్టాలు
- అనుమతి రాక పొలాలు, రోడ్లపైనే నిల్వలు
- గోతాలు లేక, కాటా కూలీలు రాక అవస్థలు
- చేసేదిలేక దళారులకు తెగనమ్ముకుంటున్న వైనం
- వ్యవసాయశాఖ విఫలం.. కొరవడిన మిల్లర్ల సహకారం
- బ్యాంకు గ్యారెంటీల నుంచి గన్నీ సంచుల వరకు గందరగోళం
- మరో రెండు వారాల్లో లక్ష్యం పూర్తి.. ఆ తర్వాత స్పష్టత కరువు
- పల్నాడులో 2 లక్షల టన్నుల దిగుబడి.. కొనుగోలు లక్ష్యం 5 వేల టన్నులే



చేలల్లోనే ఉన్న ధాన్యం బస్తాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దేనికీ వెనకాడకుండా ధాన్యం రైతుల కోసం కొనుగోళ్లలో అనేక మార్పులు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం.. కొరవడిన మిల్లర్ల సహకారంతో రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. ఒకవైపు వాయుగుండం హెచ్చరికలతో అన్నదాత వణికిపోతున్నా అధికారుల్లో చలనం లేదన్న విమర్శలున్నాయి. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చెయ్యాలని పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖలను మంత్రి మనోహర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడంలేదు. వాతావరణ పరిస్థితుల్లో ముమ్మరంగా వరి నూర్పిడులు జరుగుతున్నాయి. అయితే ఆ స్థాయిలో కొనుగోళ్లు జరగడంలేదు. ఈ ఏడాది ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని సంతోషంగా ఉన్నా రైతులను అమ్మకాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు లక్ష్యం పరిశీలిస్తే మొక్కుబడిగానే ఉన్నట్టు చెప్పవచ్చు. ఒక్క గుంటూరు జిల్లాలో మినహా బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కడా గోతాలు అందుబాటులో లేవు. అత్యధిక సాగు జరుగుతున్న బాపట్ల జిల్లాలో గోతాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని గుంటూరు జిల్లాలో 1.84 లక్షల ఎకరాల్లో వరి సాగైతే కేవలం 1.05 లక్షల గోతాలు మాత్రమే అందుబాటులో ఉంచారు. బాపట్ల జిల్లాలో 3.8 లక్షల ఎకరాల్లో వరి సాగవగా పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసిన గోతాలు కేవలం 70 వేలు మాత్రమే. అదికూడా కొన్నామని లెక్కలు చూపటం మినహా రైతులకు అందుతున్నది అంతంతే. ఎదురుచూపులు చూడలేక చివరకు రైతులే ఒక్కో గోతానికి రూ.30 నుంచి రూ.35 వరకు ఖర్చుచేసి కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. రవాణాకు వాహనాల పరిస్థితి సరేసరి. ముఠా కూలీల విషయంలో మిల్లర్లు, దళారులు కలసి దగా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కాటా కూలీలను రైతుల దగ్గరకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, దళారులు చెబితేనే వారు కదలడంలేదని చెబుతున్నారు. దళారులు కొనుగోలు చేస్తున్న ధాన్యం బస్తాల దగ్గరకు మాత్రం నిమిషాల్లో వెళ్లిపోతున్నారని, రాత్రివేళల్లోనూ కాటా వేసేస్తున్నారంటున్నారు. తాము అడిగితే ఖాళీ లేదని దాటవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దగ్గరలోని రైస్ మిల్లుకే ధాన్యం తీసుకెళ్లొచ్చన్న పాలకుల మాటలు అమలు కావడంలేదు. దాదాపు 45 కిలోమీటర్ల దూరంలోని రైస్‌మిల్లులకు ధాన్యం తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో రైతులు అల్లాడుతున్నారు. ప్రభుత్వం తేమ శాతం 17 వరకు పరిమితి పెడితే, కోస్తాలోని ఐదు జిల్లాల్లో దానిని 25 శాతానికి మినహాయింపు ఇచ్చింది. తేమ శాతాన్ని ఆర్.ఎస్.కెలు పరీక్షిస్తాయని, మిల్లులు చేయాల్సిన అవసరం లేదని

(మిగతా 8వ పేజీలో)

మిల్లర్ల రివర్స్ దోపిడీ

మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనాలంటే 75 కిలోల బస్తాకు ధాన్యం కేటగిరీని బట్టి రూ.1725 నుంచి రూ.1740 చెల్లించాలి. అదే దళారుల నుంచి కొన్న ధాన్యానికి అయితే రూ.1300 నుంచి రూ.1350 వరకు వెచ్చిస్తే సరిపోతుంది. అంటే ఎంత లేదన్నా గిట్టుబాటు ధరకు, మార్కెట్ ధరకు రూ.400 నుంచి రూ.450 వరకు బస్తా ధరలో వ్యత్యాసం ఉంటుంది. అదే తేమ సాకు చూపి కోత వేస్తే మరో రూ.200 వరకు అదనం. బ్యాక్ గ్యారెంటీ సాకుతో కొంతమంది మిల్లర్లు రైతుల నుంచి నేరుగా కొనకుండా, దళారుల ద్వారా వచ్చిన ధాన్యాన్ని కొంటున్నారని సమాచారం. ఆర్.ఎస్.కేల్లోని సిబ్బంది సహకారంతో దళారుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మినట్లు చూపిస్తున్నారు. ఇందులో రైతులకు రావాల్సిన గిట్టుబాటు ధరను కూడా మిల్లర్లు దోచేస్తున్నారనేది ఆరోపణ.

ఇబ్బందిపెడితే చర్యలు

రైతులకు 70 వేల గోతాలను అందుబాటులో ఉంచాం. మరో 3 లక్షల గోతాలు మిల్లర్లు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. కొనుగోళ్లలో ఎవరికీ ఇబ్బంది రానివ్వం. తేమ శాతం విషయంలో ఎక్కడైనా మిల్లర్లు రైతులను తప్పుదారి పట్టించి నష్టం కలిగించడానికి చూస్తే చర్యలు తీసుకుంటాం. అలాంటి మిల్లర్ల గురించి రైతులు మా దృష్టికి తీసుకురావాలి.

- విలియమ్స్, డీఎం, సివిల్ సప్లైస్, బాపట్ల జిల్లా



కలెక్టర్ వెంకటమురళి

నివేదికలతో.. అమరావతికి

- మూడు రోజులుగా ముమ్మర కసరత్తు
- సచివాలయంలో నేడు, రేపు కలెక్టర్ల సదస్సు
- సమగ్ర వివరాలతో సదస్సుకు కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు అవుతుంది. బుధ, గురువారాల్లో రాజధాని అమరావతి సచివాలయంలో జరగనున్న ఈ సదస్సులో వివిధ అంశాలపై చర్చలు, సమీక్షలు నిర్వహించనున్నారు. రెండో రోజు సాయంత్రం డీడీపీలపై ప్రజెంటేషన్ జరగనుంది. కలెక్టర్లు సమర్పించే ప్రణాళికల్లో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందినవి మాత్రమే కమిటీ ఎంపిక చేసి ప్రదర్శనకు అనుమతి ఇవ్వనుంది. ఆరు నెలల పాలనలో వివిధ విభాగల పనితీరును మదింపు చేయడంతో పాటు జిల్లాల సర్వతోముఖాభివృద్ధికి రచించాల్సిన ప్రణాళికలపై సీఎం అధ్యక్షతన సమగ్రంగా చర్చించనున్నారు. ఈ సదస్సులో పాల్గొనడానికి కలెక్టర్ వెంకటమురళి సిద్ధమయ్యారు. ఈ సదస్సులో నివేదించాల్సిన అంశాలపై గడచిన మూడు రోజులుగా వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై సమగ్ర వివరాలను సేకరించారు. రెవెన్యూ సంబంధమైన అంశాలతో పాటు ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల పరిష్కారం ఏ స్థాయిలో ఉంది, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన పనులు తదితర వివరాలతో పూర్తి స్థాయిలో కలెక్టర్ సదస్సులో పాల్గొనబోతున్నారు. ఆరు నెలల కూటమి పాలన సాధించిన విజయాలు, కలెక్టర్ దృష్టికి వచ్చిన లోటుపాట్లపై చర్చ జరగనుందనేది సమాచారం. వివిధ పనులు చేపట్టడానికి సమగ్ర నివేదికలు అందించి వాటికి నిధులు విడుదల చేయాలనే అభ్యర్థనను కూడా సీఎంకు కలెక్టర్ విన్నవించే అవకాశాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తొలి డీఆర్సీ సమావేశం ఇటీవలే జరిగిన సంగతి తెలిసిందే. దానిలో జిల్లాకు సంబంధించి పలు అంశాలు చర్చకు రాగా వాటిలో ముఖ్యమైనవి బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం, నల్లమడ వాగు ఆధునీకీకరణ, గుంటూరు ఛానల్ పొడిగింపు, భూ అవకతవకలపై చర్యలు వంటివి ఉన్నాయి. డీఆర్సీలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అనేక పనులు పెద్ద ఎత్తున నిధులతో ముడిపడి ఉన్నాయి. ఇదే అంశాన్ని సదస్సులో సీఎం ముందు కలెక్టర్ ఉంచనున్నట్లు సమాచారం. సూర్యలంక బీచ్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఇవ్వడానికి కేంద్రం సుముఖతతో ఉందనే అంశాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కూడా చెప్పారు. ఈ క్రమంలో పర్యాటకంగా జిల్లాను అగ్రగామిగా నిలపడానికి ఇక్కడ ఉన్న అవకాశాలతో పాటు ఏయే విభాగాలకు నిధులు ఖర్చు చేస్తే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు జనరేట్ అవుతాయనే వివరాలను కూడా సదస్సులో కలెక్టర్ వివరించనున్నట్లు తెలుస్తోంది. ఇక బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి రెండున్నరేళ్లు దాటినా ఇప్పటికీ అనేక సాంకేతిక చిక్కులు వెంటాడుతున్నాయి. వీటిలో ముఖ్యంగా దాదాపు అన్ని కార్యాలయాల్లో ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేకపోవడం వల్ల పనుల్లో వేగం లోపిస్తోంది. ఇక జిల్లా అధికారులలో చాలా వరకు ఇన్‌చార్జిలే ఉన్నారు. జిల్లా స్థాయి అధికారుల పోస్టులను నోటిపై చేసే విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇప్పుడు చాలా విభాగాలకు అధికారులు లేకుండా ఇన్‌చార్జిల తోనే నడిపించాల్సి వస్తోంది. వీటిని కూడా సదస్సు ముందుంచి చిక్కుముళ్ల పరిష్కారం కోసం అభ్యర్థించనున్నట్లు సమాచారం.



రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సిసోడియా, కలెక్టర్ వెంకటమురళి

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే భూ సమస్యలు

- అర్జీలను పట్టించుకోలేదు
- రెవెన్యూ సదస్సులు నిర్వహించలేదు
- రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరి సిసోడియా

పర్చూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం ప్రజలు, రైతుల నుంచి వచ్చిన అర్జీలను పట్టించుకోకపోవడం, రెవెన్యూ సదస్సులను నిర్వహించకపోవడంవల్లే భూ సమస్యలు తీవ్రమయ్యాయని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఆర్పీ సిసోడియా తెలిపారు. పర్చూరు మండలం, తన్నీరువారిపాలెం గ్రామంలో మంగళవారం డీఆర్వో గంగాధర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ వెంకటమురళితో కలిసి సిసోడియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. భూ సమస్యల వల్ల కక్షలు పెరిగి, హత్యలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 80వేల అర్జీలు అందాయన్నారు. 2017లో తప్ప ఇప్పటి వరకూ రెవెన్యూ సదస్సు నిర్వహించ లేదన్నారు. రైతుల సమస్యలకు సత్వర పరిష్కారానికే ప్రభుత్వం సదస్సును ఏర్పాటు చేసిందన్నారు. జవాబుదారీ విధానంతో గ్రామ సభలు నిర్వహించి రైతుల భూ సమస్యలను నిర్దేశిత గడువు లోపే పరిష్కరించే విధంగా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీసర్వేతో గ్రామాల్లో భూములు విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, సమస్యలు చోటుచేసుకున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం రైతులకు 1(బీ)అడంగల్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, డీపీవో కేఎల్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

6లో
విద్యుత్‌శాఖ ఉద్యోగులకూ ముఖ హాజరు
● తొలిగా సర్కిల్ కార్యాలయంలో అమలు
● యాప్ డౌన్‌లోడ్‌కు అధికారుల ఆదేశాలు

పోలీసుల అదుపులో వైసీపీ నాయకుడు
శ్రీనునాయక్‌పై జంగమహేశ్వరపాడు నాటుబాంబుల కేసు

రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలి
● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఆదేశాలు

ఇసుక రేవుల్లో.. ఇష్టారాజ్యం
● అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో విజిలెన్స్ తనిఖీలు
8లో

ఇక అమరావతి పరుగులు

- పనులకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం
- 20 పనులకు రూ.11,467 కోట్లు కేటాయింపు
- రాజధానిలో ఆగిపోయిన హ్యాపీనెస్టుకూ మోక్షం
- ఏడీబీ, ప్రపంచ బ్యాంకుల నుంచి భారీగా నిధులు



గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏడీబీ, ప్రపంచ బ్యాంకుల నుంచి భారీగా నిధులు.. కూటమి ప్రభుత్వ పట్టుదల.. సీఆర్‌డీఏ అథారిటీ ప్రత్యేక దృష్టి నేపథ్యంలో రాజధాని అమరావతిలో పనులు పరుగులు తీయనున్నాయి. సీఆర్డీఏ ఈ నెల 2న సిద్ధం చేసిన ప్రతిపాదనలకు ఆ మరుసటి రోజు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ క్రమంలో గతంలో ఆగిపోయిన పనుల పునరుద్ధరణకు మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు జీవో 968ను కూడా జారీ చేసింది. ఏపీసీఆర్డీఏ ప్రతిపాదించిన 20 రకాల పనులకు రూ.11,467 కోట్లు కేటాయించింది. గతంలో ఆయా పనులకు సంబంధించి టెండర్ల కాలపరిమితి తీరిపోగా పనులను పునఃప్రారంభించడానికి కూటమి ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది.

రాజధానిలో పనుల సందడి..

గత టీడీపీ ప్రభుత్వం వేల ఎకరాల భూములు సేకరించి రూ.10 వేల కోట్లతో అనేక ప్రభుత్వ భవనాలను, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను రాజధానిలో నిర్మించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అమరావతిని శ్మశానంగా మార్చే ఉద్దేశంతో పనులను నిలిపేసింది. దీంతో రాజధాని పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. కాగా ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రమాణ స్వీకారానికి ముందే రాజధాని పునర్నిర్మాణంపై దృష్టి పెట్టింది. తొలుత రూ.36.5 కోట్లతో 29 గ్రామాల్లోని 24 వేల ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టింది. 2014- 19లోనే తుది దశకు చేరిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవనాలు మొదలు, గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, క్లాస్- 4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్ల నిర్మాణ పనులు సహా మొత్తం 20 రకాల పనులు తక్షణం ప్రారంభం కానున్నాయి. రూ.594.54 కోట్లతో భవనాలను పూర్తి చేయడంతోపాటు, మరో రూ.226.26 కోట్లతో తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, భవన సంరక్షణ తదితర సదుపాయాలు కల్పించనున్నారు. రూ.594.36 కోట్లతో నాన్ గెజిటెడ్ అధికారుల టవర్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, రూ.516.6 కోట్లతో ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల నివాసాలు, న్యాయమూర్తుల భవనాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

లే అవుట్ల అభివృద్ధికి రూ.3,859.66 కోట్లు

భూ సమీకరణ(ఎల్‌పీఎస్) విధానంలో భూములిచ్చిన రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. తొలివిడతగా 8,496.3 ఎకరాల్లో ప్లాట్ల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి, మంచినీటి సరఫరా, వరద నీరు, మురుగునీరు పారుదల, విద్యుత్, ఐటీసీ కేబుళ్లు, రోడ్ల వెంట వాకింగ్ ట్రాకులు, సైక్లింగు ట్రాకులను రూ.3,859.66 కోట్లతో నిర్మించనున్నారు. రూ.1,585 కోట్లుతో కొండవీటి వాగు, పాలవాగు వెడల్పు, శాఖమూరు, నీరుకొండ వద్ద రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రూ.984కోట్లతో హ్యాపీనెస్ట్ ప్రాజక్టు కింద నిర్మించనున్న 12 టవర్లతో 1200 అపార్ట్‌మెంట్లు నిర్మించనున్నారు.

రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

● సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్



సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ, డీఆర్‌వో

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ప్రథమ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబరు 17న ఇక్కడికి రానున్నారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించి విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన ఎయిమ్స్‌లో రాష్ట్రపతి పర్య టనకు సంబంధించిన ఏర్పాట్లపై ఎయిమ్స్, వైద్య ఆరోగ్య శాఖ, కృష్ణా-గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 17వ తేదీ ఉదయం 11.20 గంటలకు భారత వాయు సేన విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయా నికి రాష్ట్రపతి చేర ుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యా హ్నం 12.05 గంటలకు మంగళగిరి ఎయిమ్స్‌లో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అనంతరం గన్నవరం విమానాశ్రయం నుంచి తిరిగి ప్రయాణం అవుతారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి హాజరయ్యారు.

విద్యుత్‌శాఖ ఉద్యోగులకు ఇకపై ముఖ హాజరు

● తొలిగా సర్కిల్ కార్యాలయంలో అమలు
● విడతల వారీగా డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో
● యాప్ డౌన్‌లోడ్‌కు ఉన్నతాధికారుల ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో ఉద్యోగులకు ఇకపై ముఖ ఆధారిత హాజరు (ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఏ)) విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. విద్యుత్ శాఖలో ప్రవేశపెడుతున్న ఈ సరికొత్త విధానాన్ని తొలిగా సర్కిల్ కార్యాలయంలో అమల్లోకి తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ఎఫ్ఆర్ఏ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గుంటూరు సర్కిల్ కార్యాలయం విద్యుత్ భవన్‌లో ఉద్యోగులు సదరు యాప్‌ను తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఉన్న తాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. కాగా, జనవరి 1 నుంచి పూర్తి స్థాయిలో ఎఫ్ఆర్ఏ అమల్లోకి తీసుకురానున్నట్లు విద్యుత్‌శాఖ వర్గాలు స్పష్టం చేశాయి. గుంటూరు, సీఆర్‌డీఏ, పల్నాడు, బాపట్ల సర్కిల్ కార్యాలయాల ఉద్యోగులకు దీనిని తొలిసారి అమలు చేయనున్నారు. సర్కిల్ కార్యాలయంలో ఎఫ్ఆర్ఏ అమల్లోకి వచ్చిన తర్వాత విడతల వారీగా డివిజన్, సెక్షన్ కార్యా లయాల్లోనూ అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమా చారం. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులకు ఫేస్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే తరహాలో విద్యుత్ ఉద్యోగులకూ ఈ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ప్రభుత్వ కార్యాలయల్లో సమయ పాలన పాటించడంతో పాటు పనిలో వేగం పుంజుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పుడూ పరిపాలనలో పారదర్శకత, పనిలో వేగంపై ప్రత్యేక దృష్టి సారించే సీఎం చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ శాఖలో కూడా ఈ సరికొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విధానం ద్వారా ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు కార్యా లయాల్లో పనిలో కూడా వేగం పుంజుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



ఉపాధ్యాయులను విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కిష్కిందపాలెంలో కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

కొల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం, బాపట్ల జిల్లా కొల్లూరు మండల పరిధిలోని ఒక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపా ధ్యాయుడు వల్లభనేని వెంకటేశ్వరరావు విధులు నిర్వహిస్తున్నాడు. గత 20 రోజులుగా ఆ ఉపాధ్యాయుడు 6, 7 తరగతి విద్యా ర్థినులతో అస భ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఏడుగురు విద్యా ర్థినులతో వెకిలి చేష్టలకు పాల్పడుతున్న విషయాన్ని బాధిత విద్యా ర్థినులు అదే పాఠశాలలో పని చేస్తున్న మరో ఉపాధ్యాయుడుకి తెలియజేశారు. ఇటువంటి అకృతాల్యకు పాల్పడవద్దని ఆ ఉపా ధ్యాయుడికి వారు చెప్పినా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదు. సోమ, మంగళవారాల్లో మరో ఇద్దరు విద్యార్థినుల తోనూ ఆ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని వారు తమ తల్లి దండ్రులకు చెప్పారు. దీంతో, మంగళవారం ఉదయం పాఠశాలకు పెద్ద ఎత్తున తరలివచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ దాడితో ఆ ఉపాధ్యాయుడు సొమ్మసిల్లి పడిపోవడంతో గమనించిన మిగిలిన ఉపాధ్యాయులు వారి నుంచి ఆయనను రక్షించి, పోలీసులకు, గ్రామ పెద్దలకు ఈ సమాచారం అందించారు. ఎస్ఐ ఏడుకొండలు, భట్టిప్రోలు ఎస్ఐ శివయ్య ఈ పాఠశాలకు చేరుకుని విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని భట్టిప్రోలు స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మంగళవారం సాయంత్రం రేపల్లె డీఎస్పీ ఏ శ్రీనివాసరావు కిష్కిందపాలెం చేరుకుని పాఠశాలలోని ఉపాధ్యాయులతో చర్చించారు. ఉపాధ్యాయుడిపై దాడి విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి వీ జ్యోతి పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను, విద్యార్థినులను విచారణ చేశారు. ఈ సంఘటనపై నివేదిక రూపొందించి జిల్లా విద్యా శాఖాధికారికి అందజేయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

మోర్జంపాడులో 3.50 లక్షల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న సీఐ భాస్కరరావు, ఎస్ఐ సతీశ్ తదితరులు

మాచవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోర్జంపాడులో పట్టపగలే దోపిడీ జరిగింది. రైతు లక్ష్మారెడ్డి ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.3.50 లక్షల నగదు అపహరణకు గురైంది. ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం, మోర్జంపాడుకి చెందిన యారం నరసింహారెడ్డి తన బంధువు రూ 3.50 లక్షల నగదును శనివారం రాత్రి లక్ష్మారెడ్డికి ఇవ్వ డంతో ఈ నగదును బీరువాలో భద్రపరిచాడు. ఈ మొత్తం సొమ్మును సోమవారం బ్యాంకు ఖాతాలో వేయాలని అనుకున్నాడు. అయితే, సోమవారం ఉదయం 8 గంటలకే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా రావడంతో రైతు లక్ష్మారెడ్డి హడావుడిగా తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్ళిపోయాడు. అనంతరం లక్ష్మారెడ్డి భార్య తమ పిల్లలను పాఠశాలకు పంపించి తాను కూడా పొలం వెళ్ళింది. గుర్తుతెలియని వ్యక్తులు లక్ష్మారెడ్డి ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా తలుపులు పగలగొట్టి అందులో ఉన్న రూ 3.50 లక్షల నగదును అప హరించుకు పోయారు. సాయంత్రం ఇంటికి వచ్చిన లక్ష్మారెడ్డి, తలు పులు తెరిచి ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. బీరువా తలుపులు తెరిచి ఉండటం, అందులో నగదు లేకపోవడంతో చోరీ జరిగినట్టు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న దాచేపల్లి సీఐ భాస్కరరావు, మాచవరం ఎస్ఐ సతీష్ సంఘటనా స్థలా నికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ కూడా పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. బాధితుడు లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



గౌరవ కల్నల్ సర్టిఫికెట్ అందుకుంటున్న పీ నాగభూషణ్

విజ్ఞాన్ వర్సిటీ వీసీకి గౌరవ కల్నల్ ర్యాంక్

గుంటూరు(విద్య),డిసెంబరు 10: చేబ్రోలు మండ లంలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్‌కు ఎన్‌సీసీ విభా గంలో గౌరవ కల్నల్ ర్యాం క్‌ను మంగళ వారం అందు కున్నారు. న్యూఢిల్లీలోని గవ ర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ వారు ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను, గెజిట్ నోటిఫికేషన్‌ను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడర్ వీ. మధుసూదన్ రెడ్డి విజ్ఞాన్ యూనివర్సిటీకి విచ్చేసి నాగ భూషణ్‌కు ఈ ర్యాంక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎన్‌సీసీను సమగ్ర అభివృద్ధి కోసం చేస్తున్న కృషికి గాను గౌరవ కల్నల్ ర్యాం క్‌ను అందించినట్లు వివరించారు. నాగ భూషణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్ తనలభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ర్యాంక్ లభించడం వలన ఎన్‌సీసీ కార్యకలాపాలను నిర్వహించడంలో తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. కల్నల్ సంజయ్ గుప్త, గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం. చంద్రశేఖర్, ఇతర గ్రూప్ కమాండర్లు, బెటాలియన్ కమాం డింగ్ ఆఫీసర్లు, విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

దినసరి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దినసరి వేతన ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏక గ్రీవంగా ఎన్నికైంది. వికాస అధ్యక్షుడు నీలపు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, సభ్యుల సమక్షంలో మంగళవారం ఈ ఎన్నిక జరిగింది.

పట్టభద్రుల దరఖాస్తుల తుది గణాంకాల విడుదల

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదుకు సం బంధించి దరఖాస్తులు, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ పూర్తి అయింది. సోమవారం అర్ధరాత్రి వరకు దరఖాస్తులను ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో జిల్లా ఎన్నికల అధికారులు స్వీకరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ అనంతరం కొత్తగా ఆరు జిల్లాలు గుంటూరు, ఎన్‌టీఆర్, బాపట్ల, పల్నాడు, కృష్ణ, ఏలూరు నుంచి ఓటరు నమోదు కోసం 64,387 దరఖాస్తులు అందినట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు.

అలాగే ముసాయిదా జాబితాలో చేర్చిన ఓట్లలో 2341పై అభ్యంతరాలు ఫారం-7 ద్వారా అందాయి. ఓటరు చిరునామా మార్పు కోసం ఫారం-8 ద్వారా 1225 దాఖలు అయ్యాయి. మొత్తంగా 67953 క్లెయిమ్‌లు/ అభ్యంతరాలు/ దరఖాస్తులు అందాయని ఈఆర్‌వో వివరించారు. వీటిని నిర్ణీత గడువు తేదీ లోపు పరిష్కరించి నెలాఖరుకు తుది ఓటర్ల జాబితాలను విడుదల చేస్తామని చెప్పారు.

వీఆర్‌కి 9 మంది కానిస్టేబుళ్లు

పొన్నూరుటౌన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన 9 మంది కానిస్టేబుళ్లను పోలీస్ ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళగిరిలోని సీకే కన్వెషన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వచ్చిన సందర్భంగా పొన్నూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన 9 మంది సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో ఉన్నారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రాఫిక్‌లో చిక్కుకుని కొంచెం సేపు నిల్చిపోయింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు దర్యాప్తు జరిపి, విధుల్లో ఉన్న సిబ్బంది పొన్నూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన వారిగా గుర్తించారు. దీంతో, విధుల్లో ఉన్న ఆ తొమ్మిది మందిని ఈ నెల 5న వీఆర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉంది. 9 మంది వీఆర్‌కు బదిలి కావడంతో అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు ఈ కొరత మరింత పెరిగిందని ఉన్నతాధికారులకు పోలీస్ అధికారులు సమాచార మిచ్చారు.

13న వర్సిటీలో జాతీయ సదస్సు

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఈఐటీ ఆధ్వర్యంలో ఈ నెల 13న జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి ఆచార్య సంధ్యాకోలే మంగళవారం తెలిపారు. ఈ సదస్సును డైక్‌మన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ద రోల్ ఆఫ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇన్ ఇన్‌స్ట్రుమెంటేషన్' అనే అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు.

బాలికపై యువకుల అత్యాచారం

● నిందితులపై 'పోక్సో' కేసు నమోదు

కొల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికపై యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మంగళవారం ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని ఒక గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక పదో తరగతి మధ్యలో ఆపి వేసి కొల్లూరులోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. వస్త్రాల కొనుగోలుకు వచ్చిన ఆవులవారిపాలెం క్రీస్తులంకకు చెందిన విప్పర్ల ప్రేమ్‌కుమార్ అలియాస్ విక్కీ అనే యువకుడితో ఆ బాలికకు పరిచయం ఏర్పడింది. గత నెల 26 రాత్రి బాలిక తన గ్రామం వెళ్లేందుకు కొల్లూరు బజారులో వేచి ఉండగా అటువైపు వెళుతున్న యువకుడు, ఇక్కడ ఉన్నావు ఏంటని ఆ బాలికను ప్రశ్నించాడు. ఇంటికి వెళ్లేందుకని ఆమె సమాధానం చెప్పింది.

ద్విచక్ర వాహనంపై ఇంటి వద్ద వదిలి పెడతానని చెప్పడంతో నమ్మిన బాలిక ద్విచక్ర వాహనంపై అతనితో వెళ్లింది. తన గ్రామం తీసుకు వెళ్లకుండా దోనేపూడి కరకట్ట వైపు తీసుకు వెళ్లడంతో ఇదేమని ప్రశ్నించగా జవాబు ఇవ్వకుండా నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం తన స్నేహితుడు బెజ్జం శ్యాంబాబు కూడా రావడంతో ఆ యువకుడు కూడా అఘాయిత్యం చేశాడు. ఇన్ని రోజులు భయాందోళనలకు గురైన బాధితురాలు ఈ విషయం చెప్పలేదు. మంగళవారం కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులను ఆశ్రయించిన బాలిక, జరిగిన విషయాన్ని వివరించింది. దీనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. నిందితులు ఇరువురు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రయాణికుల ముసుగులో ఆటోల్లో దోపిడీలు

● రెండు ముఠాలతో సహా పది మంది అరెస్టు

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల ముసుగులో ఆటోలో దోపిడీలకు పాల్పడుతున్న రెండు ముఠాలతో సహా పది మందిని తెనాలి త్రీ టౌన్ పోలీసులు మంగళవార అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 50 వేల నగదు, 15 గ్రాముల బంగారపు నగలు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్, సీసీఎస్ అదనపు ఎస్పీ కె సుప్రజ నిందితులను మీడియా ఎదుట హాజరపరచి వివరాలు వెల్లడించారు.

20న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డీన్ ఆచార్య ఆర్ శివరాం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు బ్రోచర్‌ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావ మంగళవారం ఆవిష్కరించారు. ఏఎన్‌యూలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ద అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ)లు సంయుక్తంగా ఈ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు అభినందన సభ

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీజీ సెట్ ద్వారా ప్రతి డిపార్టుమెంట్‌లో మొదటి రెండు ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు బుధ వారం అభినందన సభ నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు రూపస్, నవిత పేర్కొ న్నారు. ఉదయం 11 గంట లకు కామర్స్ విభాగంలోని సెమినార్ హాల్‌లో జరుగుతుందని తెలిపారు.

రేపు పెన్షన్ అదాలత్

గుంటూరు(విద్య),డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న గుంటూరు, కృష్ణ,ప్రకాశం జిల్లాల్లోని భవిష్యనిధి పెన్షనర్ల కోసం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ మాధవశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి నేరుగా పెన్షన్‌దారులు హాజరై సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు. కార్యాలయానికి రాలేని వారు ro.guntur@epfindia.gov.in మెయిల్ లేదా 94946 57469 వాట్సాప్ నంబర్ లేదా 0863-2344106, 0863-2232 921 ల్యాండ్‌లైన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

48,739 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 51, 699 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,739 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 40,624 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14500	334	7500	13500
నెంబరు. 5	8000	13000	నెంబరు.5	8500	11500
273	9500	11300	273	10500	12500
341	8000	13000	341	7500	13000
4884	9500	11000	4884	10000	12500
సూపర్ 10	-	-	సూపర్ 10	8000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8500	16500	తేజ	7500	16300
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	12000
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	10000	12000
తెల్లకాయలు	4000	10000	తెల్లకాయలు	4000	9000

జంగమహేశ్వరపాడు నాటుబాంబుల కేసులో

పోలీసుల అదుపులో వైసీపీ నేత శ్రీనునాయక్



శ్రీనునాయక్ (ఫైల్‌ఫోటో)

దుర్గి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకిరాలకు చెందిన వైసీపీ నేత రమావత్ శ్రీనునాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాచర్ల పట్టణంలోని కోర్టులో మంగళవారం లొంగిపోయేందుకు వచ్చిన శ్రీనునాయక్‌ను అప్పటికే ముం దస్తు సమాచారంతో కాపుకాచి ఉన్న దుర్గి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని దుర్గి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఏడాది మే 8న ఎన్నికల సమయంలో జంగమహేశ్వరపాడులో పోలీసులు నాటుబాంబులు, వేట కొడవళ్లను గుర్తించారు. కాగా, జూలై 7న అదే గ్రామంలో నాటుబాంబు పేలడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆయా కేసులలో శ్రీనునాయక్ నిందితుడిగా ఉన్నాడు. అయితే ఈ కేసుల్లో ప్రధాన నిందితునిగా ఉన్న వైసీపీ నేత మన్నెయ్య గత నెల 29వ తేదీన మాచర్ల పట్టణంలోని కోర్టులో లొంగిపోగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా మన్నెయ్యకు శ్రీనునాయక్ ప్రధాన అనుచరుడు.

రాష్ట్ర స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలి

● ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర కార్యదర్శి దర్శనపు

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీలలో విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి దర్శనపు శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన సిద్దార్థ అకాడమి, 15వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు సమావేశాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వాన ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

శ్మశాన వాటికకు సిమెంట్ రోడ్డు నిర్మాణం

కర్లపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం గ్రామ హిందూ శ్మశాన వాటికకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాలతో కూటమి నాయకులు ఇనగంటి సునీత, గొట్టిపాటి శ్రీకృష్ణ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గూడూరు విష్ణు, ఇనగంటి కిరణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీ అయ్యప్పస్వామి పడి పూజ

కర్లపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏట్రువారిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి రామలింగం శ్రీనివాసరెడ్డి స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి పంచమండపంలో పడి పూజ చేశారు. కొండలు స్వామి భజన ఆర్కెస్ట్రాతో భజనలు నిర్వహించారు. చీరాల, బాపట్ల, కర్లపాలెం మండలాల నుంచి 600 మంది అయ్యప్పలు భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరుపతి యాత్రికులకు సరుకులు అందజేత

కర్లపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకోవటానికి తిరుమలకు కాలినడకన బయలుదేరిన భక్తులకు భోజనం కొరకు శ్రీ ఛత్రపతి శివాజి మహారాజ్ ఫౌండేషన్, బాపట్ల అధ్యక్షుడు శివాజిరాజు మంగళవారం కిరాణా సరుకులను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులందరికి పాదచారులు కృతజ్ఞతలు తెలిపారు.

12 నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

కర్లపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12 నుంచి 14 వరకు, 16 నుంచి 17 వరకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొనాలన్నారు. 16, 17 తేదీల శిక్షణ కార్యక్రమంలో ఉదయం 9 నుంచి 6 గంటల వరకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఏఎన్ఎం, మహిళా పోలీసులు, వెటర్నరీ, ఫిషరీస్, వీఆర్వోలు పాల్గొనాలని ఎంపీడీవో తెలిపారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండల స్థాయి శిక్షణ

బాపట్లరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అనే అంశంపై మంగళవారం వివిధ మండలస్థాయి అధికారులకు, గ్రామసర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మొదలగు వారికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీపీ చిన పోతుల హరిబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం మూడు బ్యాచ్‌లలో 236 మందికి రెండు రోజులు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పులి శరత్‌బాబు పాల్గొన్నారు.

● కొల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానీకరణపై సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కె.నరసింహారావు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో సిబ్బందికి 10 అంశాల గురించి వివరించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు శిక్షణ దోహదపడుతుందని ఎంపీడీవో వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోక్సో కేసులో ఇద్దరు కానిస్టేబుళ్ళు బదిలీ

బాపట్లరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫోక్సో కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాపట్ల రూరల్ సీఐ కె.గంగాధరరావును వీఆర్‌కు పంపించటంతోపాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్ళను బదిలీ చేయటం జరిగిందని మంగళవారం ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

కానిస్టేబుల్‌కు ఘన సన్మానం

కర్లపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ బదిలీపై బాపట్ల టౌన్‌కు వెళుతున్న జి.గోపిని ఎస్ఐ రవీంద్ర, తదితర పోలీసు సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాటంరాజు, మూర్తి, శివయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

వేమూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేమూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు టీడీపీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తెలిపారు.

రైలు నుంచి జారి పడి వృద్ధురాలి మృతి

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఉప్పరపాలెం రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని మహిళ రైలు నుంచి జారీపడి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. జీఆర్‌పి ఎస్ఐ సరస్వతీ తెలిపిన వివరాలు ప్రకారం.. 65 నుంచి 70 సంవత్సరాలు వయసు కలిగిన మహిళ విజయవాడ వైపు వెళ్ళే రైలు నుంచి జారీ పడినట్లు ఆనవాళ్ళు కనిపిస్తున్నాయన్నారు. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉందని భౌతికకాయాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరుచుకోవాలి : ఆర్డీవో



రెవెన్యూసదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ నేత మురళీకృష్ణ

నగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరుచుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సజ్జావారిపాలెంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు, పట్టాదారులు తమ సమస్యలను అర్జీల రూపంలో తమ దృష్టికి తీసుకురావాలని, వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీనిచ్చారు. రెవెన్యూకు సంబంధించి 35 అర్జీలు, ఐదు ఇతర అర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.నాంచారయ్య, మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతనకట్టవారిపాలెం గ్రామసచివాలయంలో తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో భూసమస్యలు, పట్టాదారుపాస్ పుస్తకాలు విద్యార్థులకు సంబంధించిన కులధ్రువీకరణ తదితర కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలోని భూ సమస్యలు, పలు సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీనివాసరావు, సర్వేయర్ ఆదిరామచంద్రరావు, ఆయా సచివాలయాలకు చెందిన వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని, రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ సూచించారు. కొల్లూరు గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, భూ సమస్యలతో బాధపడుతున్న రైతుల సంక్షేమ కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. కొల్లూరు రెవెన్యూ సదస్సుకు 8 అర్జీలు అందినట్లు ప్రత్యేక అధికారి రాంబాలాజీ రెడ్డి, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల గ్రామం పెదలంకలో కూడా సదస్సు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో డీటీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ హర్షవర్ధన్, ఎండోమెంట్ ఈవో ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో తహసీల్దార్ శ్రీనివాసరావు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్‌వి రమణ, ఎండోమెంట్ ఈవో దీవి వెంకటప్పాలచార్యులు, సర్పంచ్ బొర్రా బాబురావు, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

● అమృతలూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 10 : మండల పరిధిలోని తురుమెళ్లలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం 12, వెబ్ ల్యాండ్ కోసం 5, సర్వే కోరుతూ 4 అర్జీలు అందినట్లు తహసీల్దార్ నెహ్రూబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు, లే అవుట్‌లపై ఉక్కుపాదం

● టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆర్డీ పెనుమాక మధుకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ ఆర్డీ మధుకుమార్, టీపీవో ఎస్.మల్లికార్జునరావు

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కట్టడాలు, లేఅవుట్‌లపై ఉక్కుపాదం మోపటం జరుగుతుందని టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ ఆర్డీ పెనుమాక మధుకుమార్ తెలిపారు. బాపట్ల పట్టణ ప్రణాళిక విభాగాన్ని మంగళవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది, లైసెన్స్‌డ్ సర్వేయర్లతో సమావేశమై వారికి పలుసూచనలు చేశారు. పట్టణంలోని అక్రమ కట్టడాలను పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని 24 పురపాలక సంఘాలు, 5 కార్పొరేషన్ల పరిధిలో 4 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు పనిచేస్తున్నాయన్నారు. అనేక మంది నిర్మాణాలకు అనుమతులు తీసుకొని మరొక విధంగా కట్టడాలు జరుపుతున్నారన్నారు. మరికొంతమంది అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారన్నారు. వీరిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే నోటీసులు జారీ చేసి వారిపై కోర్టులో ఛార్జిషీట్ వేయటం జరుగుతుందన్నారు. బాపట్ల పట్టణంలో 30 అక్రమ కట్టడాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే 15మందికి నోటీసులు జారీ చేయటం జరిగిందన్నారు. అదేవిధంగా ప్లాన్‌కు విరుద్ధంగా జరుపుతున్న కట్టడాలు 30 ఉన్నట్లు తెలిసిందన్నారు. వీరిలో 15 మందికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. బాపట్లలోని ప్రధాన కూడళ్ళల్లో అక్రమంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్ విషయంలో ఛార్జిషీట్ దాఖలు చేయటానికి సిద్ధమైనట్లు చెప్పారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అందుబాటులోకి తీసుకురావటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉంటుందన్నారు. ప్రజలు అక్రమ లేఅవుట్‌లో స్థలాలు కొనుగోలు చేయవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీవో ఎస్.మల్లికార్జునరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయలపై విలువ జోడింపు కార్యక్రమం




పండ్లు, కూరగాయల విలువ జోడింపు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం పండ్లు, కూరగాయలపై విలువ జోడింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం దేవినూతల గ్రామంలో నాల్గవ రోజు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం పాఠశాల ప్రాంగణంలో టమోటో, వంకాయ, మొదలగు కూరగాయల మొక్కలు నాటారు. ఆకుకూరల విత్తనాలను చల్లారు. అనంతరం పండ్లు, కూరగాయల విలువ జోడింపు కార్యక్రమాన్ని నిర్వహించి ఆపిల్‌జామ్, టమోటోసాస్, ఉసిరికాయ క్యాండీ, ద్రాక్ష స్క్వాష్ తయారు చేయుట గురించి వివరిస్తూ ప్రదర్శించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎస్.బ్లెస్సీసాగర్, డాక్టర్ వై.అరుణకుమారి, డాక్టర్ వై.ఫణేంద్రకుమార్, డాక్టర్ వై.దిలీప్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా

● టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని



టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పల్లం సరోజని, ఆంద్రేయ, రామసుబ్బారావు

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా ఇస్తున్నట్లు ఆ పార్టీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని తెలిపారు. బాపట్ల పట్టణంలో మంగళవారం క్లస్టర్ ఇన్‌చార్జి మందపాటి ఆంద్రేయ, పట్టణ ఉపాధ్యక్షుడు బూర్లె రామసుబ్బారావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పల్లం సరోజనీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానం ఆదినారాయణ, పసుమర్తి ఆనందబాబు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్త టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకొని తెలుగుదేశం పార్టీ పరంగా లబ్ధిపొందాలని పిట్టలవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ అన్నారు. మండలంలోని చందోలు గ్రామపంచాయతీ ఎస్టీకాలనీలో మంగళవారం టీడీపీ సభ్యత్వ కార్యక్రమాలను నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కార్యాలయ సమన్వయకర్త బొంతు శివస్వామిరెడ్డి సభ్యత్వ నమోదు కార్యక్రమం పరిశీలకులుగా విచ్చేసి ఎస్టీ కాలనీలో పార్టీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, షేక్ బాజి, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన వైసీపీ నిరసన గళం : మేరుగ

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల వద్ద నిరసన గళం విప్పుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం బాపట్ల వైసీపీ కార్యాలయంలో పార్టీశ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఒక పక్క పెట్టుబడి సాయం అందక మరొక పక్క పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక అన్నం పెట్టే రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ, మండల వైసీపీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ నాయకులు వడ్డి ముక్కల డేవిడ్, కొక్కిలగడ్డ చెంచయ్య, ఎంపీపీ చినపోతుల హరిబాబు, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ పిన్నిబోయన ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ భవనానికి ప్రతిపాదించిన స్థలం పరిశీలన



కలెక్టరేట్ నిర్మాణానికి అవసరమైన భూమిని కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న ఆర్‌పీ సిసోడియా

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ నూతన భవనానికి ప్రతిపాదించిన భూమిని కలెక్టర్ జె.వెంకటమురళితో కలిసి రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా మంగళవారం పరిశీలించారు. బాపట్ల విస్తరణ శిక్షణా కేంద్రానికి సంబంధించిన భూమిలో ఏపీహెచ్ఆర్‌డీకి కేటాయించిన భూమిలో నిర్మించిన భవనంలోనే ఇప్పటి వరకు కలెక్టరేట్ కొనసాగుతుంది. రాబోయే రోజుల్లో సొంత భవనం ఏర్పాటు చేసేందుకు అదే ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని ప్రతిపాదించారు. సదరు భూమిని పరిశీలించిన ఆయన కలెక్టర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న భవనాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమా తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, డాక్టర్ పీసీ.సాయిబాబు

మానవ హక్కులే మనకు రక్ష : డాక్టర్ సర్దార్‌బేగ్

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవులకు భద్రత, స్వేచ్ఛ, గౌరవం కల్పించేవే మానవ హక్కులని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ అన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో కరపత్రాలు విడుదల చేశారు. మానవ హక్కులు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కుల, మత, లింగ, వర్గ వైకల్య వివక్షలకు గురికాకుండా మానవులందరికి హక్కులు రక్షణ కల్పిస్తాయన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే మనం మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సోమశేఖరరావు, డాక్టర్ గౌతమి, డాక్టర్ వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ

● నగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాలలో ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రాజనీతిశాస్త్రం విభాగంలో జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యంగా ఆఫ్రికా దేశాలలో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగించుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో మానవ హక్కుల కమీషన్ ప్రజల హక్కులను రక్షించటంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటనారాయణ, హిస్టరీ విభాగాధిపతి అనిల్‌బాబు, శివయ్య పాల్గొన్నారు.

పంట బీమా ప్రతి ఒక్కరూ చేయించుకోవాలి

నగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈదుపల్లి గ్రామపంచాయతీలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ అనుబంధ సంస్థలతో పాటు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించటం జరిగిందని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు అక్తర్‌హుస్సేన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో రైతులు పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రైతులతో కలసి పొలాలను సందర్శించి పంటల సాగుపై చర్చించి రైతులకు వ్యవసాయ శాఖ పథకాలపై అవగాహన కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.నాగశ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సంచాలకులు ఎన్.కిరణ్మయి యాదవ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయశాఖాధికారి మోర్లకు సేవాభూషణ్ అవార్డు

పిట్టలవానిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉమెన్ రైట్స్ ఫౌండేషన్ కాకినాడ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం గ్రంథాలయశాఖాధికారి మోర్ల శ్రీనివాసరావును సేవాభూషణ్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా శాఖా గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది, పలువురు గ్రామపెద్దలు తదితరులు అభినందించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ బొడ్డుపాటి దాసు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా జడ్జి ఒంగోలు వసంతకుమార్, కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు చేతుల మీదగా ఈ అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నిజాంపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం-రేపల్లె రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. గోకరాజుపాలేనికి చెందిన నర్రా నాగరాజు ఆముదాలపల్లిలో చర్చిలో ప్రార్థన చేసి స్వగ్రామం వెళుతుండగా నిజాంపట్నం సమీపంలో పుట్ట వద్ద మాట్లపూడికి చెందిన జాన్ మరో ద్విచక్ర వాహనంపై వెళుతూ నాగరాజును ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. నిజాంపట్నంలో ప్రాథమిక చికిత్స చేసి నాగరాజును గుంటూరు తరలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవానికి కృషి చేయాలి

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాలు, సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. భట్టిప్రోలులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన టీడీపీ మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, జగన్మోహన రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. నీటి సంఘాల నోటిఫికేషన్ విడుదలైందని, నాయకులు ఐక్యతగా కృషి చేసి ఏకగ్రీవం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, టీడీపీ మండల అధ్యక్షుడు వాకా శేషుబాబు, మోటూరి పుణ్యశ్రీనివాసరావు, వేములపల్లి జగన్నాథరావు, బట్టు మల్లికార్జునరావు, కనపర్తి సుందరరావు, వామనపల్లి కోటేశ్వరరావు, యడ్ల జయశీలరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత లబ్ధిదారులకు ముద్ర యోజన చెక్కులు అందజేత

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చేనేత లబ్ధిదారులకు ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. స్థానిక రైలుపేటలోని చేనేత సంక్షేమ సంఘం కార్యాలయంలో ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం కింద మంజూరైన 26 మంది లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే చెక్కులను అందించారు. ఆయన మాట్లాడుతూ సంవత్సరంన్నర క్రితం ముద్ర యోజన పథకం కింద లబ్ధిదారులు ఎంపిక అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం వారికి రుణాలు మంజూరు చేయించలేదన్నారు. ఈ విషయం తన దృష్టికి తీసుకురావడంతో జీడీసీసీ బ్యాంకు అధికారులతో మాట్లాడి ఎంపికైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని సూచించడం జరిగిందన్నారు. దీంతో బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున రుణాలు మంజూరు చేశారని, ఇందులో రూ.10 వేలు రాయితీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అరుణ్, పీవో వెంకట్రావు, టీడీపీ నాయకుడు బట్టు మల్లికార్జునరావు, చేనేత కార్మికులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభ విజయవంతం చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణరావు కోరారు. భట్టిప్రోలులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం భారీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 11న మార్గశిర శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని గీతా జయంతి కార్యక్రమాన్ని సౌర్యదివస్‌గా జరుపుకోవాలన్నారు. అనంతరం హైందవ శంఖారావం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, పడమటి వెంకటేశ్వరరావు, వేల్పూరి శ్రీనివాసరావు, బూర్లె అరుణకుమారి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదానీ అవినీతిపై విచారణ జరిపించాలని నిరసన

కొల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అదానీ అవినీతిపై విచారణ జరిపించాలని సీపీఐ నాయకులు నిరసన మంగళవారం కార్యక్రమం చేపట్టారు. కొల్లూరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అదానితో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. అదానీని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రాన్ని ప్రత్యేక అధికారి రాంబాలాజీరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బావిరెడ్డి ప్రభాకరరావు, ఘంటా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినికి సత్కారం

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్య పూర్తి కాకముందు ఉత్తమ ప్యాకేజి అందుకున్న పూర్వ విద్యార్థిని విశ్వశాంతి విద్యాసంస్థ ఉపాధ్యాయులు, సిబ్బంది మంగళవారం సత్కరించారు. భట్టిప్రోలు విశ్వశాంతి విద్యాసంస్థలో దావూరి ఆగ్నేసు థెరిస్సా అనే విద్యార్థి 2009 నుంచి 2015 వరకు విద్యను అభ్యసించి అనంతరం నవోదయలో సీటు పొంది ఆరు నుంచి ఇంటర్ పూర్తి చేసుకుంది. జేఈఈ మెయిన్స్‌లో 99.85 శాతంతో ఎన్ఐటి వరంగల్‌లో సీటు సంపాదించి మూడో సంవత్సరం అభ్యసిస్తుంది. ఇటీవల జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆ విద్యార్థినికి ఓ కంపెనీ సంవత్సరానికి రూ.70 లక్షలు ప్యాకేజీతో ఉద్యోగం దక్కించుకుంది. ఆ విద్యార్థిని మంగళవారం తనకు విద్యాబుద్దులు నేర్పిన పాఠశాలకు రావడంతో సంస్థ ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులకు మోటివేషన్ క్లాసు ఇప్పించారు. ఆమెను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.



పూర్వ విద్యార్థిని సత్కరిస్తున్న విశ్వశాంతి విద్యాసంస్థ ఉపాధ్యాయులు, సిబ్బంది

నేటి తరానికి వీరయ్య ఆశయాలు ఆదర్శం

అమృతలూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 10 : నేటి యువతరానికి దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొడాలి వీరయ్య ఆశయాలు ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. వీరయ్య 24వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని వామనగుంటపాలెంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొడాలి వీరయ్య ఎడ్యుకేషనల్ అకాడమీ కరస్పాండెంట్ వాసిరెడ్డి ప్రియబాంధవి, మాజీ సర్పంచ్ కోగంటి తరుణ్‌కుమార్, సుబ్బారావు, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు. మోపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి హర్ష, ఎంపీటీసీ కొడాలి సుబ్బారావు, మాజీ ఎంపీపీలు మైనేని రత్నప్రసాద్, చవ్వాకుల రాఘవరావు, భీమవరపు శ్రీనివాసరెడ్డి, విశ్రాంత లెక్చరర్ కొడాలి సాయిబాబు, కొడాలి నాగయ్య, గోగినేని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలి : ఎస్ఐ



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపతిరావు

రేపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యలో రాణించాలని ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. నిజాంపట్నంలోని బీసీ సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చదువుకునే దశలో సెల్‌ఫోన్‌లకు బానిసకావొద్దని, చెడు స్నేహాలు చేయరాదని సూచించారు. భవిష్యత్తులో పలువురికి ఆదర్శంగా నిలిచే విధంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల రహితంగా రాష్ట్రం

- పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పీ నారాయణ
- త్వరలో మరో ఐదు జిల్లాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు
- పల్నాడు జిల్లాలోని జిందాల్ ప్లాంట్ పరిశీలన


వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వింటున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే పుల్లారావు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యర్థాల సమర్థ నిర్వహణ ద్వారా వచ్చే ఏడాది గాంధీ జయంతి (అక్టోబరు 2) నాటికి డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు పంచాయతీలో జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని మంత్రి నారాయణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురంలలో కూడా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2014-19 మధ్యలో ఘన వ్యర్థాల నిర్వహణపై వివిధ రాష్ట్రాలు, దేశాల్లో అధ్యయనం చేసి, ఉత్తమ విధానాలతో రాష్ట్రంలో 10 ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో ప్లాంట్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టామన్నారు.

వైసీపీ అసమర్థ నిర్వహణ ...


వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యర్థాల అసమర్థ నిర్వహణ వల్ల రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే ఆ వ్యర్థాలను శుభ్రం చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, విశాఖలోని జిందాల్ ప్లాంట్లలో 2,160 టన్నుల వ్యర్థాలను(31 శాతం) ట్రీట్మెంట్ చేస్తున్నారని తెలిపారు. ఆ ప్లాంట్ల ఏర్పాటుతో 50 నుంచి 60 కిలోమీటర్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయతీల్లో వ్యర్థాల సమర్థ నిర్వహణకు మార్గం సుగమమైందన్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా వ్యర్థాల ద్వారా గంటకు 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ, రోజుకి 12 వందల టన్నుల వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసే జిందాల్ ప్లాంట్ ఏర్పాటు సీఎం చంద్రబాబు దార్శనికతకు తార్కాణమన్నారు. కార్యక్రమంలో మంత్రితో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిందాల్ ఏపీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ఎంవీ చారి పాల్గొన్నారు.

శిథిలావస్థలో సంక్షేమ భవన

- పెచ్చులూడుతున్న శ్లాబ్.. మొదటి అంతస్తు ఖాళీ
- ఇప్పటికే కొన్ని కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లోకి...
- ఐదేళ్ళల్లో పైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం



పెచ్చులూడుతున్న శ్లాబ్.. పడిపోతున్న గోడలు.. ఇనుప చువ్వలు బయట పడి ప్రమాద స్థితిలో ఉన్న పిల్లర్స్.. పగుళ్ళతో ఎప్పుడు కూలుతుందో తెలియని కారిడార్.. ఇదీ జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ దుస్థితి. జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న సంక్షేమ భవన్‌లో సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల కార్యాలయాలు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఈ భవనం కనీస మరమ్మతులకు సైతం నోచుకోలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఒక పక్క అధికారులు, సిబ్బంది, మరోపక్క ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.






గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని జీటీ రోడ్డు నుంచి కలెక్టరేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో జిల్లా పరిషత్ కార్యాలయంలో వెనుక దాదాపు ఐదు దశాబ్దాల క్రితం సంక్షేమ భవన్ కార్యాలయాలను నిర్మించారు. గడిచిన కాలంలో సంక్షేమ భవన్ నిర్మాణాలు పూర్తిగా శిథిలమవుతూ ఉన్నాయి. ప్రస్తుతం మరింత ప్రమాదకరంగానూ మారాయి. కార్యాలయాల నిర్వహణ సరిగా లేకపోవడంతో మొదటి అంతస్తు స్లాబ్ పెచ్చులుగా ఊడిపోవడం, గోడలకు పగుళ్ళ వచ్చాయి. దీంతో అక్కడ బీసీ కార్పొరేషన్, ఇంజనీరింగ్ విభాగం, రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ కార్యాలయాలను ప్రైవేటు భవనాల్లోకి తరలించారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని మాత్రం ఇదే భవనంలో ఉన్న సమావేశ మందిరంలో కొనసాగిస్తున్నారు.

అద్దెల కట్టలేక శిథిల భవనంలోనే...

సంక్షేమభవన్‌లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ ఉద్యోగుల కోసం కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. దీంతో కార్యాలయాలకు ప్రవేటు భవనాల కోసం వేట ప్రారంభించారు. నగరంలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలను అద్దెకి ఇవ్వడానికి ప్రైవేటు వ్యక్తులు ముందుకు రాని పరిస్థితి ఉంది. చివరకు ఎట్టకేలకు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని బ్రాడీపేటలోని ఒక ప్రైవేటు భవనంలోకి మార్చారు. అక్కడ నెలనెల అద్దెలు భరించలేక కార్యాలయం ఆవరణలో ఉన్న సమావేశ మందిరంలోకి తిరిగి వచ్చేశారు. సాంఘిక శాఖ సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు బయట అద్దెలు భరించలేక ఈ శిథిల భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగిస్తున్నామని పేరుచెప్పని ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంక్షేమ భవన్ కార్యాలయాలకు కొత్త భవనాలను నిర్మించడమా? లేక ఉన్న భవనాలకు మరమ్మతులు చేయించడమా? అనే విషయాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.


బీసీ కార్పొరేషన్ చాంబర్ వద్ద పెచ్చులూడుతున్న స్లాబ్

ఖాళీ అయిన ఇంజనీరింగ్, బీసీ కార్పొరేషన్ ఈడీ చాంబర్స్



మరమ్మతుల గురించి పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడు, టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో కార్యాలయాలకు కార్పొరేట్ హంగులు కల్పించారు. ప్రత్యేక చాంబర్లు, సిటింగ్ కోసం ఆధునిక కుర్చీలు, కంప్యూటర్ డెస్కులు, అధికారుల గధులకు ప్రత్యేక సిలింగ్‌తో కూడిన నిర్మాణాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో కార్పొరేట్ హంగులతో తయారైన తొలి భవనం ఇదే. అయితే గడిచిన అయిదేళ్ళలో సంక్షేమ భవనంలోని కార్యాలయాలు మరింత ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం కొన్ని చాంబర్స్‌లోకి వర్షపు నీరు వస్తోందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

45 రకాల జబ్బులకు 'బాల సురక్ష'లో ఉచిత వైద్యం

- ఆరోగ్యరక్ష వాహనం ప్రారంభించిన కలెక్టర్ నాగలక్ష్మీ
- సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు


వాహనం ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ

గుంటూరు మెడికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుల నుంచి 18 ఏళ్లలోపు బాల బాలికల్లో కనిపించే పలు రకాల రుగ్మతలను ముందుగానే గుర్తించి తగిన చికిత్సలు అందించేందుకు రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో (ఆర్‌బీఎస్‌కే) అమలు చేస్తున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ చేసి తదుపరి చికిత్సల సిఫార్సు చేసిన పిల్లలను గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి చేరవేసేందుకు ప్రభుత్వం కేటాయించిన బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష వాహనాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మీ మాట్లాడుతూ శిశువులు, పిల్లల్లో 45 రకాల జబ్బులను గుర్తించి జిల్లా సత్వర చికిత్సకేంద్రంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. క్లబ్‌ఫుట్ (వంకర పాదాలు), క్యాటరాక్ట్, వినికిడి లోపాలు, గ్రహణం మొర్రి, నాడీవ్యవస్థ లోపాలు, రక్తహీనత, పోషకాహార లోపం, చర్మ వ్యాధులు, గుండె వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, మూర్ఛ వంటి పలు రకాల జబ్బులకు జిల్లా సత్వర చికిత్సకేంద్రంలో ఉచితంగా వైద్యసేవలు లభిస్తాయని వెల్లడించారు. ఈసేవలను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మీ కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ, డీఐవో డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ లక్ష్మానాయక్, డెమో ఏ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రేవుల్లో ఇష్టారాజ్యం



- రౌడీల బెదిరింపు.. పాటదారుడు పరారీ
- అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో విజిలెన్స్ తనిఖీలు
- 9 జేసీబీలు, 3 లారీలు, 360 టన్నుల ఇసుక స్వాధీనం

గుంటూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇసుక రేవుల్లో పాటదారుడు లేడు.. అయితే స్థానికంగా చక్రం తిప్పే వ్యక్తులు.. వారు నియమించిన రౌడీ మూకలదే రాజ్యం. రౌడీల దెబ్బకు పాటదారుడు ఎప్పుడో పరారయ్యాడు. ఇసుక తవ్వకాలు జరిపేదంతా రౌడీమూకలే. అనుమతి లేకుండా.. నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలి.. భారీ యంత్రాలతో నదీ గర్భంలో ఇసుకను తవ్వి తీసి జేబులు నింపుకుంటున్నారు. అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది రీచ్‌ల్లోకి బయట వాళ్లను రానిచ్చే పరిస్థితి లేదని కొన్ని చోట్ల యువకులను కాపలా పెట్టి మరీ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని ప్రభుత్వానికి, విజిలెన్స్ డీజీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం విజిలెన్స్, మైనింగ్ అధికారులు పరిశీలించి అక్కడ పరిస్థితిని చూసి ముక్కున వేలేసుకున్నారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐలు కొమ్మలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ, మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలు ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. నదీ గర్భంలోకి వెళ్లి ఇసుకను తవ్వి తీస్తున్నారని, జేసీబీ, ఎక్స్‌కవేటర్లను వినియోగిస్తున్నారని అధికారులు గుర్తించారు. లారీలను నదిలోకి తీసుకువెళ్తున్నారని తేల్చారు. ఈ క్రమంలో రీచ్‌ల్లో 9 జేసీబీ, ఎక్స్‌కవేటర్లు, మూడు లారీలు, 360 టన్నులు ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అచ్చంపేట, అమరావతి పోలీసు స్టేషన్లలో విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా క్రిమినల్ కేసు లు నమోదు చేస్తామని చెప్పారు.

విజయవాడ వ్యక్తి...?

అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో జరుగుతున్న ఇసుక దందా అంతా విజయవాడకు చెందిన వ్యక్తి చుట్టూ తిరుగుతుంది. అసలు ఆ వ్యక్తికి ప్రభుత్వ అనుమతి ఉందా.. లేదా అన్న విషయం తేల్చడం మైనింగ్ అధికారుల వల్ల కూడా కాలేదు. మైనింగ్ శాఖ రికార్డుల ప్రకారం ఆయా రీచ్‌ల్లో ఎవరికీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అనుమతులు ఉన్నట్లుగానే భారీ యంత్రాలతో ఇసుకను తవ్వుతున్నారు. అధికారుల రాకను గమనించి ఇసుక తవ్వి స్తున్న వాళ్ళు పరారయ్యారు. అధికారులు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడే ఉన్నా ఏ ఒక్కరు కూడా వచ్చి తమకు అనుమతి ఉందని వచ్చి చెప్పలేదని సమాచారం. అప్పటి నుంచి ఎంత మేరకు ఇసుక తవ్వి తీశారో అధికారులు లెక్కలు వేయిస్తున్నారు.


అంబడిపూడి ఇసుక రీచ్ లో భారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ ఎస్పీ డీ సూర్య శ్రావణ్ కుమార్

కొనుగోళ్లకు.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం పేర్కొంది. అయితే ఆర్.ఎస్.కెలు పరీక్షించినా మిల్లర్లు ససేమిరా అంటున్నారు. ఆ శాతాలను పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ సొంతగా తేమ పరీక్షిస్తున్నారు. ఆర్.ఎస్.కెలో నిర్ధారించిన దానికంటే కొన్ని మిల్లుల్లో 3 నుంచి 5 శాతం అదనంగా చూపిస్తున్నారు. తేమ పరీక్షించే పరికరంలో కప్పు కొలత మేరకే పొయ్యాల్సి ఉంటే, అంతకుమించి పొయడంతో తేమ శాతం కూడా అదనంగా చూపిస్తోంది. దీంతో అదనంగా వచ్చిన తేమకు సరిపడా తరుగు కింద తీసేస్తున్నారు. మళ్లీ పరీక్షలపై రైతులు ప్రశ్నిస్తుంటే బస్తాకు రూ. 50 నుంచి రూ.100 తీసుకుని ఆర్.ఎస్.కేల్లో అడిగినంత తక్కువ తేమ శాతం వేసిస్తున్నారని, అందుకే తాము పరిశీలించుకుంటున్నామని మిల్లర్లు దబాయిస్తున్నారు. తేమ శాతం ఒక్కో పాయింట్‌కు రూ.20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారు. వరి నూర్పిళ్లు యంత్రాలతో చేస్తున్నందున తేమ శాతం ఎక్కువగా ఉంటున్నది. తేమ శాతం ప్రభుత్వం చెబుతున్నట్టు 17 శాతమే ఉండాలంటే 10 నుంచి 15 రోజులు ఆరబెట్టాలి. చేలల్లో ధాన్యం ఆరబెట్టే పరిస్థితులు లేవు. పొలం నుంచి ధాన్యాన్ని కేంద్రానికి తీసుకు రావడానికి బస్తాకు రూ.100 ఖర్చు అధికంగా అవుతున్నది. 40 కిలోల గోతానికి రూ.3.39 ధరను అధికారులు నిర్ణయించారు. అయితే ఈ ధరకు గోతం కొనే పరిస్థితి లేదు. 75 కిలోల గోతం ధర రూ.20 నుంచి 30 వరకు ఉంది. హమాలీ కూలీ క్వింటాకు రూ.25గా నిర్ణయించారు. రవాణా చార్జీలు స్థానికంగా ఎక్కడికక్కడ నిర్ణయించనున్నారు. అయితే ఇవేవీ అమలు కావడంలేదు. దీంతో రైతులు అయినకాడికి అమ్మేసుకుంటున్నారు. రాబోయే రెండు మూడు వారాల్లోనే లక్ష్యం వరకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఆ తర్వాత ఏమిటన్న దానిపై అధికారుల్లో స్పష్టత కొరవడింది. సరైన ప్రణాళికలు లేని కారణంగానే ధాన్యం సేకరణ విషయంలో రైతులు అగచాట్లు పడుతున్నారు. గతంలో మిల్లరు ధాన్యం సేకరణ కోసం పోటీ పడేవారు. ఈ దఫా ప్రభుత్వం తేమ శాతం నిబంధనల విషయంలో సడలింపులు ఇవ్వడంతో భవిష్యత్తులో సీఎంఆర్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్న మిల్లర్లు తాము బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన మేరకు సేకరించి మిన్నకుండిపోతున్నారని సమాచారం.



బ్యాంక్ గ్యారెంటీ అయిపోయిందంటూ..

రైతు వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ లేదా ఆర్.ఎస్.కెలకు వెళ్లి ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించి మిల్లు అనుమతి తీసుకోవాలి. అయితే మిల్లులు రైతుల నుంచి ధాన్యం కొనాలంటే వాటికి బ్యాంక్ గ్యారెంటీ అవసరం ఉంటుంది. తుఫాన్ సమయంలో భారీగా ధాన్యం కొనుగోలుతో చాలా మిల్లులకు బ్యాంకులకు గ్యారెంటీ పరిమితి దాటిపోయింది. కొనుగోళ్లకు ఇబ్బందులు రాకుండా మిల్లులకు 1:1 నిష్పత్తిలో కాకుండా 1:2 నిష్పత్తిలో కూడా ప్రభుత్వం అనుమతులిచ్చింది. అయితే ఈ అవకాశాన్ని వారు రైతులకు వినియోగించకుండా దళారుల నుంచి ధాన్యాన్ని కొనడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ అయిపోయిందని, రెండు రోజుల్లో వస్తుందని, వచ్చాకే ధాన్యం కొనగలమని చెప్తున్న మిల్లర్లు దళారుల నుంచి మాత్రం లారీలకు లారీల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

బాపట్ల జిల్లాకు ఇన్‌చార్జి అధికారే దిక్కు..

జిల్లాలో కీలకమైన ధాన్యం సేకరణ జరుగుతున్న సమయంలో సివిల్ సప్లయిస్ డీఎంగా పౌరసరఫరాలశాఖ అధికారే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ధాన్యం సేకరణ సమయంలో డీఎంను కలెక్టర్ సరెండర్ చేశారు. ప్రత్యామ్నాయం కింద డీఎస్‌వోకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఏ విషయంలోనూ ఫలితాలు చూపించలేని పరిస్థితి నెలకొంది. గతంలో డిసెంబరు మూడో వారంలో ధాన్యం చేతికొచ్చేది. కానీ ఈ సారి దాదాపు ఈ నెల మొదటి వారంలో నూర్పిళ్లు మొదలైనా కొనుగోళ్లకు సన్నద్ధతలో వ్యవసాయశాఖ వైఫల్యం స్పష్టంగా కనబడింది. తుఫాన్ ప్రభావంతో వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడవడం వంటివన్నీ అన్నదాతలను వెంటాడడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

ఇప్పటి వరకు 28,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అన్నదాతల చేతికి రాగా మద్దతు ధరకు సేకరించింది కేవలం 5,800 మెట్రిక్ టన్నులే. దాదాపుగా 15,000 టన్నుల ధాన్యం దళారుల పరమైంది. సేకరణ లక్ష్యాన్ని 50,000 టన్నులుగానే నిర్ధేశించుకున్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత

కృష్ణవేణి డిగ్రీ కళాశాల



విజేతల జట్టుకి ట్రోఫి అందజేస్తున్న ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

గుంటూరు(విద్య),డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న వర్సిటీ అంతర కళాశాల వాలీబాల్ టోర్నమెంట్ (మెన్) మంగళవారం ముగిసింది. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్ల మధ్య సాగిన పోటీలో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు మొదటి స్థానంలో నిలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో వర్సిటీ కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు, నాల్గొవ స్థానంలో ధనలక్ష్మి కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు నిలిచాయి. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను వర్సిటీ వాలీబాల్ (మెన్) జట్టులోకి తీసుకుంటారు. త్వరలో కేరళ యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీస్ వాలీబాల్ (మెన్) టోర్నమెంట్‌లో వర్సిటీ జట్టు పాల్గొంటుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టోర్నమెంట్ పరిశీలకులు డాక్టర్ సూర్యనారాయణ, సెలక్షన్ కమిటీ మెంబెర్స్ పాతూరి శ్రీనివాస్, జే. ప్రేమ్ కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్ సెక్రటరీ డా.పి.గౌరీ శంకర్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎమ్. శివ రామకృష్ణ తెలిపారు. విజేతలను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

19, 26 తేదీల్లో శబరిమలకు అదనపు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఈ నెల 19, 26 తేదీల్లో అదనపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07175 సికింద్రాబాద్ - కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 19, 26 (గురువారం) తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల మీదగా శుక్రవారం అర్థరాత్రి దాటాక 1.30కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07176 కొల్లం - సికింద్రాబాద్ రైలు ఈ నెల 21, 28 తేదీల్లో (శనివారం) వేకువ జామున 5 గంటలకు బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 1.30కి సికింద్రాబాద్ చేరుకొంటుందన్నారు.

మిర్చి రైతులను ఆదుకోండి



- పంటకు కనీస మద్దతు ధర కల్పించండి
- కేంద్ర మంత్రులు పీయూష్, శివరాజ్‌సింగ్‌కు డాక్టర్ పెమ్మసాని వినతి

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని మిర్చి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. స్పైసెస్ బోర్డ్ అఫ్ ఇండియాలో మిర్చి విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. పెరుగుతున్న పెట్టుబడులు, చీడపీడల బెడద, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మిర్చి రైతుల జీవనోపాధి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు మంగళవారం పెమ్మసాని లేఖ రాశారు. మిర్చి బోర్డు ఏర్పాటు ద్వారా చీడపీడల నివారణ, ఎగుమతి సౌకర్యాలు, ఆధునిక ప్రాసెసింగ్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. మిర్చికి కనీస మద్దతు ధర కల్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పెమ్మసాని విజ్ఞప్తి చేశారు. మిర్చి ఎకరా సాగు సగటు వ్యయం 2.50 లక్షలకు చేరిందని, 2022-23 నుంచి మిర్చి ధరలు 50 శాతం పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. కౌలు రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.



గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సిసోడియా, కలెక్టర్ వెంకటమురళి

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే భూ సమస్యలు

- అర్జీలను పట్టించుకోలేదు
- రెవెన్యూ సదస్సులు నిర్వహించ లేదు
- రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా

పర్చూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రజలు, రైతుల నుంచి వచ్చిన అర్జీలను పట్టించుకోకపోవడం, రెవెన్యూ సదస్సులను నిర్వహించకపోవడం వల్లే భూ సమస్యలు తీవ్రమయ్యాయని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా పేర్కొన్నారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం, తన్నీరువారిపాలెంలో మంగళవారం డీఆర్వో గంగాధర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ వెంకటమురళితో కలిసి సిసోడియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సదస్సులను నిర్వహిస్తోందన్నారు. భూ సమస్యల వల్ల కక్షలు పెరిగి, హత్యలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 22(ఏ) సిస్టం తారుమారు చేయడం వల్ల భూ సమస్యలు పెరిగాయన్నారు. ఇప్పటివరకు జరిగిన రెవెన్యూ సదస్సులో 80వేల అర్జీలు అందడం ఇందుకు నిదర్శనమన్నారు. 2017లో తప్ప ఇప్పటివరకూ రెవెన్యూ సదస్సు నిర్వహించలేదన్నారు. రైతుల సమస్యలకు సత్వర పరిష్కారానికే ప్రభుత్వం సదస్సును ఏర్పాటు చేసిందన్నారు. జవాబుదారీ విధానంతో గ్రామ సభలు నిర్వహించి రైతుల భూసమస్యలను నిర్ణీత గడువులోపే పరిష్కరించే విధంగా సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రైతుల మేలుకోరి ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వివాదాలు, సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ఈ సదస్సుల ధ్యేయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీసర్వేతో గ్రామాల్లో భూములు విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, సమస్యలు చోటుచేసుకున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం రైతులకు 1(బీ), అడంగల్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, డీపీవో కేఎల్ ప్రభాకరరావు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డ్వామా పీడీ జి.పరీక్షిత్, ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏపీవో బుల్లియ్య, సర్పంచ్ ఆళ్ల వెంకన్న, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సతీష్‌చంద్ర, హౌసింగ్ డీఈ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

మందుబాబులు కనిపిస్తే చర్యలు

- సెక్యూరిటీ, కంట్రోల్ పాయింట్ సిబ్బందిని ఆదేశించిన డీఎం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆర్టీసీ కంట్రోల్ పాయింట్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మందుతాగి బస్టాండ్‌లో తిరుగుతూ, బల్లలపై పడుకునే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చూడాలని డిపో మేనేజర్ బీ రాంమోహరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ఆర్టీసీ బస్టాండ్‌లో తాగి నిద్రపోతున్నారు కథనంపై డిపో అధికారులు స్పందించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించే వ్యక్తులపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. ప్రతి రోజు బస్టాండ్ ప్రాంతాల్లో తాగి తిరుగుతున్నా, బల్లలపై పడుకున్నా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం సిబ్బంది, కంట్రోల్ పాయింట్ సిబ్బంది డీఎం ఆదేశించారు. పోలీస్ అధికారులతో బస్టాండ్ ప్రాంతంలో మందుబాబులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు డీఎం తెలిపారు.

ప్రయాణికులు తికమక

- ఒంగోలు బస్టాండ్‌లో అద్దంకి బస్సులు నిలిపే ప్లాట్‌ఫాం మార్పు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ లో అద్దంకి వైపు వచ్చే బస్సులు నిలిపే ప్లాట్‌ఫారంను మార్చడంతో ప్రయాణికులు తికమక పడుతున్నారు. ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌లో అద్దంకి, నర్సరావుపేట, వినుకొండ రూట్‌లలో నడిచే బస్సులు 16, 17 నెంబర్ల ప్లాట్‌ఫాంలపై నిలుపుతుంటారు. ఆదివారం నుంచి 1, 2 ప్లాట్‌ఫాంలకు మార్పు చేశారు. అయితే మార్పు చేసినట్లు ఎలాంటి బోర్డులను ఏర్పాటు చేయలేదు. అదే సమయంలో ప్లాట్‌ఫాంలపై ఏయే రూట్లలో వెళ్లే బస్సులు ఆపుతారో తెలియజేసే బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నట్లు ఆర్టీసీ కండక్టర్‌లు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో మద్దిపాడు, మేదరమెట్ల తదితర ప్రాంతాలకు వెళ్లే పలువురు ప్రయాణికులు వేరే బస్సులను ఎక్కుతున్నట్లు, దీంతో మూడు రోజులుగా అద్దంకి, వినుకొండ, నర్సరావుపేట రూట్లలో తిరిగే బస్సులకు సరాసరిన రూ.2 నుంచి 3వేల రూపాయల ఆదాయం తగ్గినట్లు కండక్టర్‌లు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్‌ఫారమ్‌లు మార్పు చేసిన విషయం ప్రయాణికులకు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

13న హనుమత్ వ్రతం, దీక్ష విరమణ

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం, ఆంజనేయస్వామి దీక్షధారుల దీక్ష విరమణ సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. ఉదయం 7 గంటలకు దీక్షధారులతో ఆలయ ప్రదక్షిణ, 7-30 గంటలకు ఇరుముడి ద్రవ్యములతో ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం, 9 గంటలకు హనుమత్ వ్రతం, 12 గంటలకు మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి, మాల విరమణ, అన్న ప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు. ఆంజనేయస్వామి దీక్షధారులు 12వ తేదీ గురువారం సాయంత్రానికి శింగరకొండ చేరుకోవాలని సూచించారు. భక్తులకు వసతి సౌకర్యం, అల్పాహారం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భర్త, కుటుంబ సభ్యులపై ఫిర్యాదు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి) : వేధింపులకు పాల్పడుతున్నారని భర్త, కుటుంబ సభ్యులపై గుంజి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలమేరకు.. మండలంలోని ధేనువకొండకు చెందిన రాజేశ్వరి, వెంకటరావు ప్రేమించి ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల రాజేశ్వరిని హైదరాబాద్‌లో వదిలివేసి వెంకటరావు ధేనువకొండకు వచ్చాడు. దీంతో రాజేశ్వరి కూడా ధేనువకొండకు వచ్చి పుట్టింటిలో ఉంటుంది. ఈక్రమంలో ఆదివారం భర్త వెంకటరావుతో పాటు అత్త, మామలు, ఇద్దరు ఆడపడుచులు వచ్చి రాజేశ్వరిని, తండ్రిపై దాడి చేశారు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కన్వీనర్‌గా శ్రీధర్

కనిగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవహక్కుల అడిషనల్ కన్వీనర్‌గా కనిగిరికి చెందిన సామాజికవేత్త గుత్తి శ్రీధర్ ఎంపికయ్యారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా విశాఖ సెంట్రల్ లైబ్రరీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫౌండర్, నేషనల్ చైర్మన్ సంపత్‌కుమార్ నియామకపత్రాన్ని అందుకున్నారు.

హనుమ చరిత్ర వినడం శుభం



చాగంటిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య కుటుంబ సభ్యులు .. ప్రవచనాలు వినేందుకు హాజరైన శ్రోతలు

- సనాతన ధర్మోపన్యాసకులు చాగంటి
- కోటేశ్వరరావును సన్మానించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీతారాముల చరిత్ర ఉన్నంత కాలం హనుమంతుని శ్మరణ, చరిత్ర ఉంటుంది. అది హనుమంతునికి శ్రీరాముడు ఇచ్చిన వరం. సీతారాముల పారాయణం జరిగే ప్రతి చోటా ఉండి భక్తులను కాపాడాలని శ్రీరామచంద్రుడు ఆంజనేయునికి ఉపదేశించారు. హనుమంతుడు చిరంజీవి. హనుమంతుని చరిత్ర వినడం, ఆచరించడం, అత్యంత పవిత్రం, శుభమని ఆధ్మాత్మిక ప్రవచనకర్త, సనాతన ధర్మోపన్యాసకులు చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం శ్రీ హనుమత్ వైభవం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు రామాయణంలోని సుందరకాండ అంశాలను సోదాహరణంగా ప్రవచించారు. ఆంజనేయుని జన్మ వృత్తాంతం నుంచి రాముల వారితో చేసిన ప్రయాణం, రావణుడు అపహరించిన సీతమ్మ తల్లి జాడ తెలుసుకోవడంలో అంజనేయుని పాత్రను కళ్లకు కట్టినట్లు విపులంగా చెప్పారు. హనుమంతుడు సీతమ్మ వారి దగ్గర ఎంత వినయంగా ఉంటూ నమ్రతగా సమాధానం చెప్పాడో, రావణుని దగ్గర సుగుణాభిరాముని గుణగణాలు, పరాక్రమాలను వివరిస్తూ శరణుగోరమని హెచ్చరించిన తీరును వివరించారు. నోటి వాక్కును ఎంత వరకు సందర్భానుసారంగా వినిపించాలో అర్థవంతంగా చెప్పారు. సంస్కృత శ్లోకాలను వల్లెవేస్తూ అందుకు తెలుగు అనువాదం చెప్తూ పండితులు, పామరులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో చాగంటి వారి ప్రవచనాల పరంపరలో పలుమార్లు శ్రోతలు హర్షధ్వానాలతో కూడిన భక్తిభావాన్ని వెలిబుచ్చారు.

ప్రవచన పాఠం అనంతరం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఆయన సతీమణి బాల కొండమ్మ, పెద్ద కుమారుడు గౌరీఅమర్‌నాథ్, చిన్న కుమారుడు, టీడీపీ చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఆయన నుంచి ఆశీర్వచనాలు పొందారు. బుధవారం సాయంత్రం కూడా ఆధ్యాత్మిక ప్రవచనాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి విశేష సంఖ్యలో హాజరైన భక్తులు, శ్రోతలకు ప్రసాద వితరణ జరిగింది. ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు తగిన ఏర్పాట్లు చేశారు. ప్రవచనాలు వినేందుకు వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

చిన్నారుల హక్కులకు భంగం వాటిల్లితే ఉపేక్షించేది లేదు



చిన్నారుల బరువుని పరిశీలిస్తున్న పద్మావతి

చినగంజాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : చిన్నారుల హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లినా ఉపేక్షించేది లేదని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. మండలంలోని కడవకుదురు, చినగంజాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రాలు, సోపిరాలలోని అంగన్‌వాడీ కేంద్రం, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడవకుదురు అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న సదుపాయాలను ఆమె పరిశీలించారు. కేంద్రాల్లోని చిన్నారుల బరవులను, రిజిస్టర్స్, స్టాకు రిజస్టర్స్ ఆహార పదార్థాలు, మురుగు దొడ్లు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల పరిధిలోని బాలింతలకు బాల సంజీవని కిట్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించి తరగతుల వారీగా విద్యార్థుల హాజరు రిజస్టర్‌లను పరిశీలిచగా పాఠశాల విద్యార్థులు 20 శాతంపైగా డ్రాప్ అవుట్స్ ఉన్నారని, 30 శాతం పైగా రెగ్యులర్ ఆప్సెంట్స్‌లో ఉన్నట్లు ఆమె గుర్తించారు. స్టాక్ రూమ్‌లో కోడిగుడ్లు, బియ్యం, చిక్కీ, రాగిపిండి అధిక మొత్తంలో ఉండడంతో విద్యార్థులకు సకాలంలో అందించడం లేదని గుర్తించి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూశారు. చినగంజాం ప్రాథమిక పాఠశాల, పాఠశాలలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను, భవిత కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ముళ్లపొదలు, చిల్లచెట్లతో నిండి ఉండడంతో ఉపాధ్యాయులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంఈవో ఎస్.కోటేశ్వరరావు, సీడీపీవో టీ.ఝాన్సీ, జిల్లా బాలల సంరక్షణాధికారి పురుషోత్తమరావు, ఎస్.ఐ ఎస్.రమేష్, సూపర్‌వైజర్లు వాణిశ్రీ, సుమలత, ఉషాకుమారి, గ్రామ మహిళాపోలీసు కార్యదర్శి కామాక్షి, సీఆర్పీ సీ.హెచ్.సురేంద్రకుమార్, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో పోష్ యాక్ట్‌పై అవగాహన

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో మంగళవారం విద్యార్థులకు పోష్ యాక్ట్-2013 (లైంగిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరా వు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పూర్తి స్థాయి సంరక్షణ వాతావరణం ఉండేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కమిటీ ప్రిసైడిం గ్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.నాగధనలక్ష్మి మాట్లాడుతూ సెక్సువల్ హెరాష్‌మెంట్ ఎలా ఉంటుంది, ఎలా ఫిర్యాదు చేయాలి, ఎలా పరిష్కరిస్తారు అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తనిఖీలలో పాల్గొన్న విద్యుత్‌శాఖ అధికారులు

విద్యుత్ అక్రమ వాడకందారులపై భారీ జరిమానా

ఇంకొల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలో అక్రమంగా విద్యుత్‌ను వినియోగంపై మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 95 మంది అధికలోడు విద్యుత్ వాడుతున్నట్లు గుర్తించారు. వీరికి రూ.3,27,00 జరిమానా విధించినట్లు ఇంకొల్లు విద్యుత్ ఏఈ రామకృష్ణ తెలిపారు. అనధికారికంగా ఎవరైనా విద్యుత్ వినియోగిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలలో 32మంది అధికారులు డీఈ రమేషబాబు, థామస్, హరిప్రసాదరావు, మల్లికార్జునరావు, షర్మిల, వెంకటరత్నం పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న ఏవో కాశీవిశ్వనాథ్

వేటపాలెం, చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేసిన పైర్లు, పంటలకు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని ఏవో కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి, బచ్చులవారిపాలెం గ్రామాల పరిధిలోని రైతులకు మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పురుగుమందులు పచికారి చేసేటపుడు వేపనూనెతో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. పీఎం ఫసల్ బీమా యోజన పథకం ప్రీమియం ఈ నెల 15వ తేదీలోపు చెల్లించాలని సూచించారు. ఈపంట నమోదు అవశ్యకతను వివరించారు. రై తుల సందేహాలను నివృత్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : రైతులు పంట దశను అనుసరించి పురుగు మందులు వాడాలని లేకుంటే పంట ఎండిపోతుందని వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. మంగళవారం చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెం, వాడరేవు ప్రాంతాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏలు రమేష్, హదస్స, రైతులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాను వినియోగించుకోవాలి

మార్టూరు : ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.మేరమ్మ రైతులను కోరారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పంటలకు ఇన్సూరెన్స్ కింద శనగకు రూ.84, మొక్కజొన్నకు రూ.105 వరికి రూ.126 ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.సుదర్శన్, ఎస్ రాము, రైతులు పాల్గొన్నారు.

పంట కోతలు వద్దు

తుఫాన్ ముప్పు పోయేవరకూ రైతులు పంట కోతలు చేయొద్దని ఏవో వీరగంధం కిరణ్ కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని వలపర్ల, కోలలపూడి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ అధికారి క్రాంతి కుమార్, వీఏఏ హరి, నవీన్ పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ఈ-పంట నమోదు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుందని ఏడీఏ కె.ధనరాజ్ రైతులకు తెలిపారు. మంగళవారం మండలంలోని మణికేశ్వరం, కొంగపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడువులోపు ఈ పంట నమోదును పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, ఉద్యాన అధికారి ఎస్.దీప్తి, వీఏఏలు రాణి పాల్గొన్నారు.

బల్లికురవ : రైతులు పంట బీమాను వినియోగించుకోవాలని చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి పేర్కొన్నారు. మంగళవారం కొప్పెరపాలెం, వేమవరం గ్రామాలలో పోలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పొగాకు, పత్తి, మొక్కజొన్న పంటలను ఏవో పరిశీలించారు. తుఫాన్ ఉన్న దృష్ట్యా కోతలు వద్దని సూచించారు.

సస్యరక్షణతో కత్తెర పురుగు నివారణ

పంగులూరు : సాగులో ఉన్న మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు ఆశించిందని, దాని నివారణకు తగు సస్యరక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. మండలంలో మంగళవారం రామకూరు, భగవాన్‌రాజుపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న మొక్కజొన్న, వరి పైరును పరిశీలించి పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పంట నమోదుతో పాటు పంటల బీమా విధిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్, వ్యవసాయ శాఖ సిబ్బంది పృథ్వీ, రైతులు పాల్గొన్నారు.



శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ప్రతినిధులు

క్రమశిక్షణకు మారు పేరు కేవీ

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రమ శిక్షణ, కష్టపడే తత్వానికి మారుపేరు హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు అని చీరాల ఉప విద్యాశాఖ అధికారి అబ్బరాజు శ్రీనివాసావు, బాపట్ల జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గెల్ల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం రాత్రి అద్దంకిలోని గీతామందిర్‌లో యూటీఎఫ్ అద్దంకి మండలశాఖ, బాపట్ల జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డును అందుకున్న హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించారు. వినుకొండ సుధాకరరావు అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. అటు విద్యార్థులను తీర్చిదిద్దడంలో, పాఠశాల అభివృద్ధికి శ్రీనివాసరావు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో బీ సుధాకరరావు, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరకొండ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పేరిరెడ్డి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, బాబూరావు, హనుమంతరావు, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంతో వ్యాధులు దూరం

బల్లికురవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మరుగు దొడ్లను వినియోగించుకోవడం ద్వారా వ్యాధులూ దూరమవుతాయని ఎంపీడీవో కె.కుసుమకుమారి పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జనతో వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని, అందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈ నాయక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు గోపీకృష్ణ



పవన్ గోపీకృష్ణ

పంగులూరు, డిశంబరు 10 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్ గోపీకృష్ణ రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. ఈ నెల 6వ తేదీన జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీలో రెండవ స్థానం సాధించిన చాతరాజుపల్లి పవన్ గోపీకృష్ణ 30వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి సాధిక్ తెలిపారు. కౌశల్ క్విజ్ పోటీలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైన పవన్ గోపీకృష్ణను హెచ్ఎం అణిత, ఎస్ఎంసీ చైర్మన్ గోలి సంధ్యారాణి, గ్రామ పెద్దలు చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, రావుల వెంకట నరసింహారావు, ఉపాధ్యాయులు మంగళవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

లారీ ఢీకొని బైకిస్టుకు గాయాలు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని మోటార్‌సైకిలిస్టు కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన వల్లెపు శివప్రసాద్ మంగళవారం ఉదయం మోటార్‌సైకిల్‌పై అద్దంకి టౌన్‌లోకి వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో గాయాలైన శివ ప్రసాద్‌ను అద్దంకి లోని వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

హుండీ దొంగ అరెస్టు

పంగులూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు పోలేరమ్మ గుడిలో హుండీలో సొమ్ము అపహరించిన నిందితుడు పూరిమిట్ల నారాయణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత శుక్రవారం తెల్లవారుజామున పోలేరమ్మ ఆలయంలో దొంగతనానికి పాల్పడిన నారాయణను మంగళవారం అలవలపాడు అడ్డరోడ్డువద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని నుంచి రూ.22వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. చందలూరుకు చెందిన కందిమళ్ల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు రేణంగివరం ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన నారాయణ అనే వ్యక్తి నాలుగు ప్రదేశాలలో చోరీకి పాల్పడినట్లు విచారణలో అంగీకరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్పీ, చీరాల డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ మల్లికార్జునరావు పర్యవేక్షణలో ఎస్‌ఐ వినోద్‌బాబు తన సిబ్బందితో దర్యాప్తు చేశారు. అదుపులోకి తీసుకున్న నారాయణను మంగళవారం అద్దంకి కోర్టుకు హాజరు పరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ. వినోద్‌బాబు తెలిపారు.

కొనుగోళ్లకు.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం పేర్కొంది. అయితే ఆర్.ఎస్.కెలు పరీక్షించినా మిల్లర్లు ససేమిరా అంటున్నారు. ఆ శాతాలను పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ సొంతగా తేమ పరీక్షిస్తున్నారు. ఆర్.ఎస్.కెలో నిర్ధారించిన దానికంటే కొన్ని మిల్లుల్లో 3 నుంచి 5 శాతం అదనంగా చూపిస్తున్నారు. తేమ పరీక్షించే పరికరంలో కప్పు కొలత మేరకే పొయ్యాల్సి ఉంటే, అంతకుమించి పొయడంతో తేమ శాతం కూడా అదనంగా చూపిస్తోంది. దీంతో అదనంగా వచ్చిన తేమకు సరిపడా తరుగు కింద తీసేస్తున్నారు. మళ్లీ పరీక్షలపై రైతులు ప్రశ్నిస్తుంటే బస్తాకు రూ. 50 నుంచి రూ.100 తీసుకుని ఆర్.ఎస్.కేల్లో అడిగినంత తక్కువ తేమ శాతం వేసిస్తున్నారని, అందుకే తాము పరిశీలించుకుంటున్నామని మిల్లర్లు దబాయిస్తున్నారు. తేమ శాతం ఒక్కో పాయింట్‌కు రూ.20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారు. వరి నూర్పిళ్లు యంత్రాలతో చేస్తున్నందున తేమ శాతం ఎక్కువగా ఉంటున్నది. తేమ శాతం ప్రభుత్వం చెబుతున్నట్టు 17 శాతమే ఉండాలంటే 10 నుంచి 15 రోజులు ఆరబెట్టాలి. చేలల్లో ధాన్యం ఆరబెట్టే పరిస్థితులు లేవు. పొలం నుంచి ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావడానికి బస్తాకు రూ.100 ఖర్చు అధికంగా అవుతున్నది. 40 కిలోల గోతానికి రూ.3.39 ధరను అధికారులు నిర్ణయించారు. అయితే ఈ ధరకు గోతం కొనే పరిస్థితి లేదు. 75 కిలోల గోతం ధర రూ.20 నుంచి 30 వరకు ఉంది. హమాలీ కూలీ క్వింటాకు రూ.25గా నిర్ణయించారు. రవాణా చార్జీలు స్థానికంగా ఎక్కడికక్కడ నిర్ణయించనున్నారు. అయితే ఇవేవీ అమలు కావడంలేదు. దీంతో రైతులు అయినకాడిక అమ్మేసుకుంటున్నారు. రాబోయే రెండు మూడు వారాల్లోనే లక్ష్యం వరకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఆ తర్వాత ఏమిటన్న దానిపై అధికారుల్లో స్పష్టత కొరవడింది. సరైన ప్రణాళికలు లేని కారణంగానే ధాన్యం సేకరణ విషయంలో రైతులు అగచాట్లు పడుతున్నారు. గతంలో మిల్లరు ధాన్యం సేకరణ కోసం పోటీ పడేవారు. ఈ దఫా ప్రభుత్వం తేమ శాతం నిబంధనల విషయంలో సడలింపులు ఇవ్వడంతో భవిష్యత్తులో సీఎంఆర్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్న మిల్లర్లు తాము బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన మేరకు సేకరించి మిన్నకుండి పోతున్నారని సమాచారం.

బ్యాంక్ గ్యారెటీ అయిపోయిందంటూ..

రైతు వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ లేదా ఆర్.ఎస్.కెలకు వెళ్లి ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించి మిల్లు అనుమతి తీసుకోవాలి. అయితే మిల్లులు రైతుల నుంచి ధాన్యం కొనాలంటే వాటికి బ్యాంక్ గ్యారెంటీ అవసరం ఉంటుంది. తుఫాన్ సమయంలో భారీగా ధాన్యం కొనుగోలుతో చాలా మిల్లులకు బ్యాంకులకు గ్యారెంటీ పరిమితి దాటిపోయింది. కొనుగోళ్లకు ఇబ్బందులు రాకుండా మిల్లులకు 1:1 నిష్పత్తిలో కాకుండా 1:2 నిష్పత్తిలో కూడా ప్రభుత్వం అనుమతులిచ్చింది. అయితే ఈ అవకాశాన్ని వారు రైతులకు వినియోగించకుండా దళారుల నుంచి ధాన్యాన్ని కొనడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ అయిపోయిందని, రెండు రోజుల్లో వస్తుందని, వచ్చాకే ధాన్యం కొనగలమని చెప్తున్న మిల్లర్లు దళారుల నుంచి మాత్రం లారీలకు లారీల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

బాపట్ల జిల్లాకు ఇన్‌చార్జి అధికారే దిక్కు

జిల్లాలో కీలకమైన ధాన్యం సేకరణ జరుగుతున్న సమయంలో సివిల్ సప్లయిస్ డీఎంగా పౌరసరఫరాలశాఖ అధికారే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ధాన్యం సేకరణ సమయంలో డీఎంను కలెక్టర్ సరెండర్ చేశారు. ప్రత్యామ్నాయం కింద డీఎస్‌వోకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఏ విషయంలోనూ ఫలితాలు చూపించలేని పరిస్థితి నెలకొంది. గతంలో డిసెంబరు మూడో వారంలో ధాన్యం చేతికొచ్చేది. కానీ ఈ సారి దాదాపు ఈ నెల మొదటి వారంలో నూర్పిళ్లు మొదలైనా కొనుగోళ్లకు సన్నద్ధతలో వ్యవసాయశాఖ వైఫల్యం స్పష్టంగా కనబడింది. తుఫాన్ ప్రభావంతో వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడవడం వంటివన్నీ అన్నదాతలను వెంటాడడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఇప్పటి వరకు 28,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అన్నదాతల చేతికి రాగా మద్దతు ధరకు సేకరించింది కేవలం 5,800 మెట్రిక్ టన్నులే. దాదాపుగా 15,000 టన్నుల ధాన్యం దళారుల పరమైంది. సేకరణ లక్ష్యాన్ని 50,000 టన్నులుగానే నిర్దేశించుకున్నారు.



శ్మశానంలో తొలగించిన చిల్లచెట్లు

ముక్తేశ్వరంలో శ్మశానం పరిశుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిట్టడవులను తలపిస్తున్న మరు భూములు అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మంగళవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో అధ్వానంగా ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ మీరా వలి, గ్రామ సర్పంచ్ పర్యవేక్షణలో కార్మికులు తుమ్మ చెట్లను యంత్రాలతో తొలగించారు. అనంతరం ప్రజలకు ఇబ్బందులు లేకుండా శ్మశాన వాటిక రోడ్డును శుభ్రం చేయించారు.

గోతులను అలా కప్పేశారు!

- గుండ్లకమ్మ బ్రిడ్జిపై కాంక్రీట్‌తో లేయర్ వేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశం
- అయినా అధికారుల మీనమేషాలు
- తాత్కాలిక మరమ్మతులతో మమ



గుండ్లకమ్మ బ్రిడ్జిపై గోతులకు ఇటీవల చేసిన తాత్కాలిక మరమ్మతులు.. మరలా పడుతున్న గుంతలు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ నదిపై దర్శి రోడ్డులో ఉన్న బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు తరచూ గోతులు పడుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతుండడంతో పట్టుమని పది రోజులు కూడా గడవకముందే మరలా యథావిధిగా గోతులు పడుతున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడడంతో పాటు ఏ సమయంలో కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. 4 దశాబ్దాల కిందట గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జిని నిర్మించారు. 17 సంవత్సరాల కిందట బ్రిడ్జిలోని కొన్ని ఖానాలు కుంగడంతో రాకపోకలు తాత్కాలికంగా నిలిపి వేసి మరమ్మతులు చేసి పునరుద్ధరించారు. అప్పటి నుంచి వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూనే ప్రయాణిస్తున్నారు. బ్రిడ్జిపై గోతులు పడి శ్లాబులో వినియోగించిన ఇనుప చువ్వలు కూడా బయటపడ్డాయి. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు అప్పుడప్పుడు తాత్కాలికంగా తారుతో గోతులు పూడ్చి సరిపెడుతున్నారు. ఇటీవల అద్దంకి మండలంలో మోదేపల్లిలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లే క్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బ్రిడ్జి పరిస్థితిని గమనించారు. మోదేపల్లిలో సభకు హాజరైన ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. గుండ్లకమ్మ బ్రిడ్జిపై కాంక్రీట్ లేయర్ వేసి గోతులు పూడ్చాలని ఆదేశించారు. అయితే అనంతరం తారుతోనే మరలా గోతులను తాత్కాలికంగా పూడ్చి మమ అనిపించారు. గోతులు పూడ్చి పక్షం రోజులే కాగా మరలా మరమ్మతుల చేసిన ప్రాంతాలలో గోతులు పడుతున్నాయి. ఇలా తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రయోజనం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, వాహనాల రద్దీకి తగ్గట్టు కొత్త బ్రిడ్జి ఏర్పాటుపై మంత్రి గొట్టిపాటి ప్రత్యేక దృష్టి సారించాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ శీనానాయక్

ప్రతిభ విద్యార్థులకు చేయూత

బల్లికురవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ ప్రతిభ చూపే విద్యార్థులకు బ్యాంక్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కె. శీనానాయక్ తెలిపారు. మంగళవారం గుంటుపల్లి గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 7, 8, 9 తరగతులలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న బి.అమృత, డి.మహిమ తేజస్వీ, యు. గాయత్రిలకు ఒక్కొక్కరికీ రూ.5వేల నగదు చెక్కులను ఏపీజీబీ శాఖ ప్రగతి విద్యాజ్యోతి పథకం కింద మేనేజర్ శీనానాయక్ అందజేశారు. ప్రతి ఏటా ఇలా విద్యార్థులకు చేయూతను అందస్తున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంక్‌లో ప్రగతి త్రివేణి, ప్రగతి కుబేర్ డిపాజిట్ స్కీం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళకుమారి, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్లు కె.సుహిత గ్రేస్, జి.బిందు మాధవి, డి.గోపీకృష్ణ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థికి బంగారు పతకం



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న హితేష్

మార్టూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన నేషనల్ స్థాయి కరాటే పోటీలలో కర్పూరపు హితేష్ అనే విద్యార్థి బంగారు పతకాన్ని సాధించాడు. మండలంలోని ఇసుక దర్శి గ్రామానికి చెందిన హితేష్ ఒంగోలులోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో 6వతరగతి చదువుతున్నాడు. చిలకలూరిపేటలో జరిగిన డాక్టరు బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ నేషనల్ లెవెల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో మొదటి బహుమతి గోల్డ్‌మెడల్‌ను సాధించారు. ఈ మేరకు కరాటే మాస్టర్ దేవరకొండ వెంకటేష్, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ చేతులమీదగా హితేష్ గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ కావ్య

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అపోలో హాస్పటల్, కృతి ఫౌండేషన్ వారి సహకారంతో మండల పరిధిలోని దేవాంగపురి (జాండ్రపేట)లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. డాక్టర్ కావ్యారెడ్డి (గైనకాలజీ), డాక్టర్ లతశ్రీ (పీడియాట్రిక్స్), డాక్టర్ రంగనాథ్ (ఆర్థోపెడిక్), డాక్టర్ గోపీవర్మ (జనరల్ మెడిసిన్), అపోలో చీరాల హాస్పటల్ వైద్య నిపుణుల బృందం ఆయా విభాగాల రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఆహార, నియమాలను వివరించారు. హాస్పటల్ జనరల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో 250 మంది రోగులకు వైద్యసహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమం లో కృతి ఫౌండేషన్ ప్రతినిధులు, అపోలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్ల నొప్పులను ముందే గుర్తించాలి



పరీక్షలు చేస్తున్న డాక్టర్ నవీన్

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మోకాళ్ల నొప్పులను తొలి దశలో గుర్తించి, సరైన చికిత్స చేయించుకుంటే ఆపరేషన్ అవసరం లేకుండా పీ ఆర్పీ వైద్య విధానంతో నయం చేయవచ్చని, అది శ్రీ కామాక్షికేర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ దివ్య తెలిపారు. శ్రీకామాక్షి కేర్ హాస్పటల్లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ జి.నవీన్‌కుమార్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ గవిని లక్ష్మీనారాయణ, ఆత్మలిక్ ఆఫీసర్ డాక్టర్ తాడివలస కుమార్ తదితర ఆయా విభాగాలకు చెందిన రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందలను అందజేశారు. ఈ శిబిరంలో 106 మంది వైద్య సేవలు పొందినట్లు హాస్పిటల్ ఎండీ డాక్టర్ తాడివలస దేవరాజ్ తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం

బల్లికురవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చేసుకుంటే జీవితాలు నాశనం అవుతాయని ఐసీడీఎస్ సీడీపీవో సుధ విద్యార్థినులకు సూచించారు. మండలంలోని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి సీడీపీవో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వలన కలుగు నష్టాల గురించి వాటి నియంత్రణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మీరాబి, సురేఖ, అనూష, అంగన్ వాడీ కార్యకర్తలు భూలక్ష్మి, పద్మావతి, పుష్పలత, దివెనమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

ఏలూరి చొరవతో రైతులకు ఊరట

అలేరు వాగు భూసేకరణ ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు విజయకుమార్

నాయుడువారిపాలెం/కారంచేడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దకాలంగా పరిష్కారానికి నోచుకోని ఆలేరు వాగు (లెఫ్ట్ ఆర్మ్) కాలువ నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో సాధ్యమైందని ఆలేరు వాగు భూసేకరణ ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు విజయకుమర్ అన్నారు. మంగళవారం కారంచేడు మండలం నాయుడువారిపాలెం గ్రామంలో ఆలేరు వాగు భూసేకరణ ఫార్మర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతుల సమస్యలపై ఎమ్మెల్యే ఏలూరి చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. రైతులకు సంబంధించి ఏమైనా భూ సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కమిటీ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో కమిటీ వైస్ ప్రెసిడెంట్ నల్లూరి శ్యాంప్రసాద్, కార్యదర్శి తాళ్లూరి రామారావు, జాయింట్ సెక్రటరీ నాయుడు శ్రీనివాసులు, కోశాధికారి నాయుడు వెంకట్రావు, పెంట్యాల నాయుడమ్మ, వెంకటరామ భూపాలరావు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



వాడరేవు రెవెన్యూ సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భూ సంబంధిత రెవెన్యూ సమస్యలను రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని పరిష్కరించుకోవాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు చెప్పారు. మండల పరిధిలోని వాడరేవులో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారితో మాట్లాడారు. సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేవిధంగా చర్యలు చేపడతామని తెలపారు. సమస్యల పరిష్కార దిశగా అర్జీదారులకు అవగాహన కల్పించాలని అధికారులకు చెప్పారు. సదస్సులో తహసీల్దార్ గోపీకృష్ణ, డివిజనల్ సర్వేయర్ మునలయ్య, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చినగంజాం : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని స్పెషల్ ఆఫీసర్ డీఎల్‌డీవో పద్మావతి అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో మ్యూటేషన్ కోసం మూడు, భూ కొలతలకు ఐదు, కుల్రధ్రువీకరణకు ఐదు, ఆదాయపు ధ్రువీకరణకు ఒకటి, 1బీ కోసం ఒకటి, అడంగల్‌కు ఆరు అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, మండల సర్వేయర్ సుబ్బారావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : మండలంలోని ఇసుకదర్శి గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 25 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టీ ప్రశాంతి తెలిపారు. ఈ సదస్సుకు స్పెషల్ ఆఫీసర్ డీఆర్‌డీఏ పద్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోనంకి రెవెన్యూ భూములకు సంబంధించి 25 అర్జీలను గ్రామస్థులు ఇవ్వగా, పట్టాదారు పాస్ పుస్తకాలకు 3, సర్వేకు 5 అర్జీలు అందాయి. కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, ఆర్ఐ రహమాన్ బాషా, మండల సర్వేయరు ఏడుకొండలు పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : భూ సమస్యలపై 48 అర్జీలు అందినట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. పూసలపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

పంగులూరు : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రత్యేకాధికారి, మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ అన్నారు. ముప్పవరం, జాగర్లమూడివారిపాలెంలో తహసీల్దార్ పి.సింగారావు నేతృత్వంలో రెవెన్యూ సదస్సు లు నిర్వహించారు. ముప్పవరం సదస్సులో డిజిటల్ సిగ్నేచర్ సమస్యలు నాలుగు, ఎఫ్ లైన్ సమస్యలు మూడు, ఆర్వోఆర్ సమస్య లు 20 రాగా, డిజిటల్ సిగ్నేచర్ 4, రీప్లేస్‌మెంట్ సమస్యలను వెంటనే పరిష్కరించా రు. జేవీపాలెంలో ఎఫ్‌లైన్ 6, మ్యూటేషన్ చేయాలని 7దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు. సర్వేయర్ సురేష్‌బాబు, ఆర్ఐ బాబయ్య, నాయకులు ఏడుకొండలు, స్వామి, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలి



సభలో మాట్లాడుతున్న అడ్వకేట్ రామకృష్ణారెడ్డి

చినగంజాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ హక్కులు, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చీరాల బార్ అసోసియేషన్ సీనియర్ అడ్వకేట్ ఆసోది రామకృష్ణారెడ్డి అన్నారు.

ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల వారి అధ్వర్యంలో మంగళవారం జరిగిన న్యా య విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మా ట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని రామకృష్ణారెడ్డి సూచించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో మానవ హక్కుల గురించి, బాలల హక్కులు, బాల వివాహాల నిరోధక చట్టం, మత్తు పదార్థాల నిరోధక చట్టం తదితర విషయాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి.రత్నకుమారి, లోక్ అదాలత్ ఇన్‌చార్జి వి.వీరరాఘవులు, పారా లీగల్ వలంటీర్ ఎంవీ.రామారా వు, ఎస్.ఎం.సుభాని, సామాజిక కార్యకర్త ఎస్‌డీ మతీన్, పాఠశాల బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ మం దులు వాడుకుంటూ పింఛన్ రానివారు ఈ నెల 12, 13 తేదీల్లో ఒంగోలు ఏఆర్‌టీ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని అద్దంకి ఐసీటీసీ సెంటర్ కౌన్సిలర్ రమేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బాధితులు వారి ఆధార్ కార్డు, ఫోన్, బ్యాంక్ పాస్ పుస్తకం, బాధితుల గ్రీన్ బుక్‌తో దరఖాస్తు చేయాలని సూచించారు.

18న విశ్రాంత ఉద్యోగుల భవనం ప్రారంభం

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అద్దంకి యూనిట్ నూతన భవన ప్రారంభోత్సవం కార్యక్రమం పట్టణంలోని భాగ్యనగర్ 4వ లైన్‌లో ఈ నెల 18వ తేదిన ఉదయం 9గంటలకు జరుగుతుందని అధ్యక్షుడు షేక్ మస్తాన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అనంతరం పెన్షనర్స్ డే వేడుకలు జరుగుతాయని, పెన్షనర్లు, దాతలు, శేయోభిలాషులందరు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మహిళకు రక్త దానం

అద్దంకిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు రోటరీ క్లబ్ ప్రోత్సాహంతో రక్తదానం చేశారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రక్తహీనతో బాధపడుతున్న పాతిమాకు బీ నెగిటివ్ రక్తం అవసరం కాగా రోటరీ బ్యాంక్ డైరెక్టర్ మురళీసుధాకర్ ప్రోత్సాహంతో సాయిసురేష్ ద్వారా రక్తం సేకరించి అందజేశారు.

పోలియో వ్యాధిగ్రస్తురాలికి సాయం

మార్టూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గడ్డం బజారులో పోలియో వ్యాధి గ్రస్తురాలైన రామసుబ్బులు అనే మహిళకు మంగళవారం హెల్పింగ్ హాండ్స్ సభ్యులు కొంతనగదు, నిత్యావసరవస్తువులను అందచేశారు. కార్యక్రమంలో పఠాన్ ఖాదర్‌వలి, ఎస్‌కే కాలేషావలి, పుట్టా అయ్యప్పస్వామి, పుట్టా వెంకటేశ్వర్లు, జాఫర్, నరసింహారావు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

వేటపాలెం, చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విఘ్నేశ్వరకాలనీ శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

ధర్నాను జయప్రదం చేయండి

ఇంకొల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మండల కార్యాలయాల వద్ద ఈ నెల 16వ తేదీన జరిగే ధర్నాను రైతులు జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందమళ్ల రామకోటేశ్వరరావు, కార్యదర్శి రామారావు కోరారు. మంగళవారం రైతు నాయకులతో సమావేశం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్య లు, ఎరువులు బ్లాక్‌లో అమ్మడాన్ని నిరసిస్తూ ధర్నా చేయనున్నట్లు తెలిపారు.